

హలో ... ఓటెవరికి వేస్తారు?

● ఫోన్ కాల్స్‌తో విసిగిపోతున్న జనం

డక్కిలి, జనవరి 24 : ఇంకా ఎన్నికల నోటిఫికేష్ విడుదల కాలేదు...ప్రధాన పార్టీల నుంచి పోటీచేసే అభ్యర్థులు ఎవరన్నది కూడా ప్రకటించకపోయినా ఫోన్ ద్వారా సర్వేల పేరుతో మొబైల్ ఫోన్లలో వినిపిస్తున్న ప్రశ్నల వర్షంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరి కొందరైతే ఫోన్ చేసిన వారితో గొడవకు సైతం దిగుతున్నారు. హలో మీ ఓటెవరికి వేస్తారండి అని మొదలెట్టి మీ వయసెంత ?, మీదే కులం?, పలానా వ్యక్తికి ఎందుకు ఓటు వేయడం లేదు?, ఆయన పని తీరు మీకు నచ్చలేదా ? నచ్చకపోతే ఎందుకు నచ్చలేదు? వలంటీరు పనితీరు ఎలా వుంది ? మీకు రేషన్ అందుతోందా? అంటూ సవాలక్ష ప్రశ్నలు గుప్పిస్తున్నారు. రోజూ ఇలాంటి కాల్స్ ఒకటి కాదు రెండు కాదు ఏడెనిమిది వరకూ వస్తున్నాయని ఓటర్లు చెబుతున్నారు. కొన్ని సర్వే సంస్థలైతే ఫోన్లకు వీడియో సందేశాలు పంపుతున్నాయి. బిజీ సమయాల్లో కొత్త నెంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు చేశారేమోనని లిఫ్ట్ చేసేసరికి ప్రచార సమాచారం విని ఏమీ మాట్లాడకుండా కట్ చేసేస్తున్నారు. మరి కొందరైతే నియోజకవర్గం పేరు చెప్పి త్వరలో జరిగే ఎన్నికల్లో అభ్యర్థుల పేర్లు కాకుండా పార్టీ పేర్లు చెప్పి మీరే పార్టీకి ఓటేస్తారని అడుగుతున్నారు. కొంతమంది నాయకులు తమకు టికెట్ వస్తే గెలుస్తామో లేదో అని కూడా సర్వేల ద్వారా ముందే తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నారు. వెంకటగిరి నియోజవర్గంలో ఓ పార్టీ తరఫున ఇప్పటికే అన్ని గ్రామాల్లో సర్వే బృందాలు దిగి సర్వేలు మొదలు పెట్టాయని సమాచారం.

సచివాలయాల్లో వైసీపీ నేతల మీటింగులు

సిబ్బందికి,వలంటీర్లకు ఎన్నికల్లో ఎలా పనిచేయాలో పాఠాలు



ఏర్పేడు, జనవరి 24 : సచివాలయాలను వైసీపీ నాయకులు పార్టీ ప్రచార కేంద్రాలుగా వాడుకుంటున్న వైనం ఏర్పేడు మండలంలో బుధవారం బయటపడింది.మండలంలో 19సచివాలయ కేంద్రాలుండగా వాటిలో 13కేంద్రాల్లో అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు బుధవారం సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు వచ్చే ఎన్నికల్లో చేయాల్సిన పనుల గురించి సూచనలిచ్చారు.ఈ విషయాన్ని ఈవో పీఆర్డీ చెప్పినట్లుగా ముందు రోజే ఓ పంచాయతీ అధికారి సచివాలయ డీడీవోలకు, వలంటీర్లకు వాయిస్ మెసేజ్ పంపాడు. అంతే కాకుండా ఏ సచివాలయానికి ఎంత సమయానికి వైసీపీ నాయకులు వస్తారో కూడా తెలియపరిచాడు.ఆ సమయానికి వలంటీర్లతో సచివాలయ సిబ్బంది సిద్ధంగా ఉండాలని వాయిస్ మెసేజ్‌లో సూచించారు. అదే ప్రకారం బుధవారం వైసీపీ నాయకులు 13 సచివాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఎన్నికల్లో పనిచేయాల్సిన తీరును, ప్రజలకు చెప్పాల్సిన అంశాలను వివరించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తమ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఒక దగ్గర ఉంచాలని ఆదేశించి మరీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.వచ్చే ఎన్నికల్లో వైసీపీ కోసం పనిచేయకపోతే ఉద్యోగాలుండవని చెప్పినట్లు సమాచారం. ఈ ప్రచార కార్యక్రమాలను పార్టీ కార్యాలయాల్లో నిర్వహిస్తే బాగుంటుందని ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది వైసీపీ నాయకులకు సూచించినట్లు తెలిసింది.

ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో సీఎం

రాజకీయ అంశాలపైనా స్పందించిన జగన్

తిరుపతి (నేరవిభాగం), జనవరి 24 : నాణ్యమైన విద్య పొందే హక్కు ప్రతి ఒక్కరికీ వుండాలని సీఎం జగన్ అభిప్రాయపడ్డారు.తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో ఇండియా టుడే మీడియా సంస్థ నిర్వహించిన ఎడ్యుకేషన్ సమ్మిట్-2024 కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ జాతీయ స్థాయి విద్యాస మ్మేళనానికి రెండవరోజైన బుధవారం సాయంత్రం జగన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాజ్ హోటల్‌కు సాయంత్రం 4.50 గంటలకు చేరుకున్న జగన్ రాష్ట్రంలో విద్యా విధానం గురించిన చర్చలో ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో కలిసి పాల్గొన్నారు. విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను, సంస్కరణలను ఆయన ఎడ్యుకేషన్ సమ్మిట్ వేదికపై వివరించే ప్రయత్నం చేశారు.కాకపోతే విద్యావిధానం గురించిన చర్చకు మాత్రమే పరిమితం కావాల్సిన వేదికపై ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ వేసిన ప్రశ్నలకు స్పందిస్తూ రాజకీయ అంశాలపైనే అధికంగా మాట్లాడడం చర్చనీయాంశమైంది.అనంతరం 6.33గంటలకు ఆయన తిరుగుప్రయాణమయ్యారు. విమానాశ్రయంలో మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా తదితరులతో పాటు ఎమ్మెల్యేలు,వైసీపీ ప్రముఖులు సాదర స్వాగతం, వీడ్కోలు పలికారు.



ఎడ్యుకేషన్ సమ్మిట్ వేదికపై సీఎం జగన్‌తో జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్



సీఎం కారులో ఇరుక్కుని కలెక్టర్ ప్రయాణం

తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) :సీఎం జగన్ బుధవారం రేణిగుంటలోని విమానాశ్రయం నుంచీ తిరుపతిలోని తాజ్ హోటల్‌కు వచ్చేటపుడు, తిరిగి వెళ్ళేటపుడు రెండుసార్లూ కలెక్టర్ వెంకట్రమణారెడ్డి సీఎం కారులోనే ఇరుక్కుని కూర్చుని ప్రయాణించడం కనిపించింది. ముందు సీట్లో సీఎం కూర్చుని వుండగా వెనుక సీటులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ కూర్చున్నారు. కలెక్టర్ కూడా ప్రయాణించడంతో వెనుక సీట్లో ఇరుకైంది. దీంతో ఆయన టీటీడీ ఛైర్మన్, మంత్రి పెద్దిరెడ్డి ఒళ్ళో కూర్చున్న చందంగా ఇరుక్కుని ప్రయాణించడం కనిపించింది. సీఎం కాన్వాయ్‌లో పలు వాహనాలు అందుబాటులో వుండడంతో పాటు కలెక్టర్‌కు సొంత వాహనం కూడా వున్నప్పటికీ సీఎం కారులో అంతగా ఇరుక్కుని వెళ్ళాల్సిన అవసరమేమిటన్న ప్రశ్న ఎదురవుతోంది. కాన్వాయ్‌లో ఈ దృశ్యం చూసిన వారంతా దీనిపైనే చర్చించుకోవడం కనిపించింది. అయితే తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో చోటుచేసుకున్న అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం కన్నెర్ర చేయడం, పలువురు అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్న నేపథ్యంలో ప్రధానంగా ఆ అంశంపై సీఎం కారులో చర్చ జరిగివుంటుందన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

'సిద్ధం!' అంటూ ఫ్లెక్సీలు పెట్టి ఇంత భయమెందుకు?

● సీఎంను అడ్డుకుంటామని చెప్పకున్నా మమ్మల్ని గడపదాటనివ్వరా?

● టీడీపీ, జనసేన నేతల మండిపాటు

తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పర్యటనను అడ్డుకుంటామని ప్రతిపక్ష పార్టీలేవీ ప్రకటించకపోయినా నాయకులను గృహనిర్బంధంలో వుంచడం విమర్శలపాలైంది.బుధవారం తెల్లవారకముందే టీడీపీ, జనసేన నాయకుల ఇళ్ల ముందు పోలీసులు ప్రత్యక్షమయ్యారు. గడపదాటనీయకుండా కాపలాకాశారు. మీడియా సమావేశాలకు వెళ్లాలని మొత్తుకున్నా ఎస్కార్ట్‌లాగా వెంబడించారు. సాయంత్రం 4 గంటలపైన సీఎం పర్యటన ఉంటే ఉదయం 6 గంటలనుంచే ప్రతిపక్ష నాయకులను హౌస్ అరెస్టు చేశారు. తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణతో పాటు జనసేన నాయకులు కిరణ్ రాయల్, రాజా రెడ్డిలను గృహనిర్బంధం చేశారు. సాయంత్రం 6 గంటలపైన సీఎం వెళ్లిపోయాకే విడిచిపెట్టారు.ఈ సందర్భంగా సుగుణమ్మ,ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ జగన్ రెడ్డిని అడ్డుకుంటామని తాము చెప్పనప్పుడు ప్రివెంటివ్ అరెస్టులు ఎందుకు చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. తిరుపతిలో ప్రతిపక్షమే లేదని భూమన అభినయ్ రెడ్డి, ఇతర వైసీపీ నేతలు ప్రగల్భాలు పలుకుతుంటే తమ నాయకుల ఇళ్ల వద్దకు పోలీసులను ఎందుకు పంపారో అర్థం కావడంలేదన్నారు. వైసీపీ దుర్మార్గపు పాలనకు ఇదొక నిదర్శనమని మండిపడ్డారు.



ఇంటిముందున్న పోలీసులతో సుగుణమ్మ వాగ్వాదం

● 'సిద్ధం.!' అంటూ ఫ్లెక్సీలు పెట్టి...

ఎన్నికల యుద్ధానికి 'సిద్ధం' అన్నట్టుగా జగన్మోహన్ రెడ్డి ఫొటోలతో పెద్దపెద్ద ఫ్లెక్సీలు రాత్రికి రాత్రే తిరుపతి నగరమంతా పెట్టేశారు. ఫ్లెక్సీల్లో మాత్రం సిద్ధం! అంటూ సవాల్ విసిరి, ప్రతిపక్షాలను గడప దాటనీయకుండా అడ్డుకున్నారు. 'ఆయనేమో సిద్ధం అంటూ వేలు చూపిస్తున్నాడు. మీరేమో మమ్మల్ని బయటకు రావొద్దు అంటున్నారు' అంటూ సుగుణమ్మ పోలీసులనుద్దేశించి చమత్కరించారు.



'సిద్ధం..!' అంటూ తిరుపతిలో వెలసిన ఫ్లెక్సీలు

వైసీపీలో ఒక వర్గం రోజా ప్రతిష్టను దిగజారుస్తోంది : మున్సిపల్ చైర్మన్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 24: నగరి నియోజకవర్గ వైసీపీలో ఒక వర్గం పనిగట్టుకుని మంత్రి రోజా ప్రతిష్టను దిగజారుస్తోందని పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి తెలిపారు.వైస్ చైర్మన్ శంకర్,కొందరు కౌన్సిలర్లతో కలిసి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రోజా రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక చేస్తున్న దుష్ప్రచారంలో భాగంగానే కౌన్సిలరు భువనేశ్వరి ఆరోపణలు చేసిందన్నారు. సత్య అనే వ్యక్తి అప్పు తీసుకుంటే మంత్రికి ఏమి సంబంధమని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఒక వర్గం చేస్తున్న కుట్రే ఇది అన్నారు. ఆ వర్గం పేర్లు చెప్పాలని విలేకరులు అడగ్గా నీళ్లు నమిలారు.కౌన్సిలరు భువనేశ్వరి వద్ద డబ్బు తీసుకున్న సత్య మాట్లాడుతూ తాను వ్యాపార లావాదేవీల్లో భాగంగా రూ.29లక్షలు తీసుకున్నానని, ఇప్పటికే రూ.16లక్షలు చెల్లించానని, మిగిలిన బాకీ చెల్లించేలోపు మంత్రిపై అభాండాలు మోపారని తెలిపారు.

మంత్రి రోజాను బర్తరఫ్ చేయాలి : గాలి

పుత్తూరు అర్బన్, జనవరి 24: దళిత మహిళా కౌన్సిలర్‌కు మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తానని చెప్పి రూ.40 లక్షలకుపైగా దోచుకున్న రోజాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్ డిమాండు చేశారు. పుత్తూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్‌కు దళితుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కౌన్సిలర్ భువనేశ్వరికి న్యాయంచేయడంతో పాటు మొత్తం వ్యవహారంపై విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి రోజా అవినీతి గురించి తెలిసి నియోజకవర్గంలోని మహిళలు ఈసడించుకుంటున్నారని మండిపడ్డారు.నియోజకవర్గంలోని ఇసుక, గ్రావెల్, మట్టి, కంకరను రాష్ట్ర సరిహద్దులు దాటించి ప్రజల సొమ్మును దోచుకున్నారని దుయ్యబట్టారు.

మిస్టరీగా మహిళ మృతి!



పవిత్ర మృతదేహం

● ముక్కంటి ఆలయ సమీపంలో కలకలం

● బహిర్భూమి కోసం స్వర్ణముఖి నదిలోకి వెళ్లిన దంపతులు

● నీటిలో పడడంతో చనిపోయిందంటూ భర్త గగ్గోలు

శ్రీకాళహస్తి, జనవరి 24: ఆ దంపతుల మధ్య అనుమానం చిచ్చు రేపింది. తరచూ భార్యను నిందిస్తూ భర్త వేధించేవాడు. 13 రోజుల క్రితం కూడా ఆగ్రహంతో భార్యపై దాడి చేసి గాయపరిచాడు.తిరుపతిలోని ఒక వైద్యశాలలో ఆమె చికిత్స పొంది బుధవారం సాయంత్రం డిశ్చార్జి అయింది.ముక్కంటిని దర్శించుకుని ఇంటికి వస్తానని భర్త అందరికీ చెప్పాడు. ఆ ప్రకారం భార్యను వెంటబెట్టుకుని శ్రీకాళహస్తికి వచ్చాడు. స్వర్ణముఖి నదిలో ఆమెని బహిర్భూమి కోసం అంటూ వెంట తీసుకెళ్లాడు. కాసేపటి తర్వాత తన భార్య నీటిలో పడి అక్కడికక్కడే మృతి చెందిందంటూ గగ్గోలు పెట్టాడు. భర్త ప్రవర్తన, ఘటన జరిగిన తీరు ఎన్నో అనుమానాలను రేకెత్తించింది. మహిళ మృతి మిస్టరీగా మిగిలిపోయింది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు... వరదయ్యపాలెం మండలం పద్మావతిపురం ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు (55) లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. మొదటి భార్య కూతురు పుట్టిన తర్వాత అనారోగ్యంతో మృతి చెందడంతో తర్వాత పవిత్ర అలియాస్ దేవిక (36)ను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె ఓ సెల్‌ఫోన్ కర్మాగారంలో పనిచేస్తుండేది. 20 ఏళ్ల క్రితం వీరికి వివాహం జరిగింది.ఇంటర్ చదివే కొడుకు కూడా ఉన్నాడు. కొద్ది సంవత్సరాలుగా శ్రీనివాసులుకు అనుమానం మొదలైంది.భార్యను నిత్యం అనుమానిస్తూ గొడవపడేవాడు. పలుమార్లు పెద్దలు పంచాయితీ చేసి కాపురాన్ని నిలబెట్టారు. 13 రోజుల క్రితం భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన శ్రీనివాసులు ఆమె తలపై దాడి చేయడంతో పవిత్ర గాయపడింది.కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. తలలో రక్తం గడ్డ కట్టిందని చికిత్స అందించారు. పవిత్ర కోలుకున్నాక ఇకపై బాగా చూసుకుంటానని శ్రీనివాసులు బంధువులతో చెప్పాడు.దీంతో పవిత్ర డిశ్చార్జి అయ్యాక తర్వాత భర్తతో పాటు వెళ్ళమని వారు చెప్పారు.మొదట సెంటిమెంట్‌గా ముక్కంటి ఆలయాన్ని దర్శించుకుని ఒక్క రోజు క్షేత్రంలో నిద్ర చేసి ఆ తర్వాత ఇంటికి వెళ్తామని శ్రీనివాసులు అందరికీ చెప్పాడు. అదే ప్రకారం భార్యను వెంట బెట్టుకుని బుధవారం రాత్రి ముక్కంటి ఆలయ సమీపంలోని జల వినాయక కూడలి వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత బహిర్భూమి కోసం భార్యను వెంటబెట్టుకుని స్వర్ణముఖి నదిలోకి వెళ్లాడు. కాసేపటి తర్వాత తన భార్య నీటిలో పడడంతో చనిపోయిందంటూ బంధువులకు సమాచారం ఇచ్చాడు. అలాగే ఒడ్డుకు వెళ్లి అక్కడున్న వారికి విషయం చెప్పగా అంత చీకటి ప్రదేశంలోకి రాత్రివేళ భార్యను ఎందుకు తీసుకెళ్లావంటూ నిలదీశారు. ఈలోపు బంధువులు ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. చాలాకాలం నుంచి భార్యాభర్తల మధ్య విభేదాలు ఉండడం... 13రోజుల క్రితం భార్యపై దాడి చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ విలపించారు. శ్రీనివాసులు చెబుతున్న మాటలన్నీ కట్టుకథలంటూ శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి శవాన్ని తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విలపిస్తున్న పవిత్ర బంధువులు

హైస్కూల్ ప్లస్‌లో అటకెక్కిన ప్రాక్టికల్స్!

● ప్రతిపాదనలకే పరిమితమైన ప్రయోగశాలల ఏర్పాటు

● విద్యార్థినులకు శిక్షణ ఇవ్వకుండానే రెండు వారాల్లో పరీక్షలు ప్రారంభం



తిరుపతి(విద్య)జనవరి 24: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థినులు దూరం వెళ్లకుండా తాము చదివిన హైస్కూల్లోనే ఇంటర్ చదివే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం రెండేళ్లక్రితం ఎంతో ఆర్భాటంగా మండలానికి ఒకటి చొప్పున హైస్కూల్ ప్లస్‌ని ప్రారంభించింది. మరో నలభై రోజుల వ్యవధిలో తొలిబ్యాచ్ విద్యార్థినులకు సంబంధించి ఇంటర్మీడియట్ కోర్సు పూర్తికానుంది. అయితే ఇప్పటికీ సైన్స్ కోర్సులు చదివే విద్యార్థినులకు ప్రధానమైన ల్యాబ్‌లను ఏర్పాటు చేయలేదు.దీంతో తొలిబ్యాచ్ సైన్స్ విద్యార్థినులు ప్రయోగశిక్షణ లేకుండానే వచ్చేనెల 5నుంచి జరిగే ప్రయోగపరీక్షలు రాయాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ఈ ప్రయోగపరీక్షల మార్కులకు పబ్లిక్ పరీక్షల తరహా మార్కులతో సమ ప్రాధాన్యత ఉంటుంది. దీనిలో విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తే పబ్లిక్ పరీక్షల్లో స్కోర్ కూడా మరింతగా పెరుగుతుంది. అలాగే ఉన్నతవిద్య ప్రవేశాల్లోనూ ఇంటర్‌మార్కులకు అత్యధిక ప్రాధాన్యత ఉంటోంది. విద్యార్థిదశలో వారికి సైన్స్‌పై ఆసక్తితో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంచేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదం చేస్తుంది. ఈ నేపథ్యంలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో చేరిన విద్యార్థినులు ప్రయోగాలపై శిక్షణా తరగతులు చేపట్టకుండానే పరీక్షలకు సన్నద్ధం కావాల్సిరావడం విద్యార్థి, అధ్యాపకవర్గాలను ఆందోళనకు గురి చేస్తోంది. సబ్జెక్టులు బోధించే అధ్యాపకుల నియామకాలు కూడా ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత అరకొరగానే చేపట్టారు. దీంతో ఇక్కడ చదివే సైన్స్ గ్రూపుల విద్యార్థినులు ఫిబ్రవరిలో జరిగే ప్రాక్టికల్ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలన్నది మిలియన్‌డాలర్ల ప్రశ్నగా మారింది. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 30మార్కుల చొప్పున మొత్తం 60మార్కులకు, బైపీసీ విద్యార్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 30మార్కుల చొప్పున మొత్తం 120మార్కులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. వీటిలో మంచి మార్కులు వస్తే ..పబ్లిక్ పరీక్షల్లో స్కోర్ కూడా పెరుగుతుంది. ప్రయోగాల పరీక్షల ఫలితాల ప్రభావం పబ్లిక్ పరీక్షల ఫలితాల్లోనూ కనిపిస్తుంది. కాగా సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఏపీఆర్‌జేసీ, ఆదర్శపాఠశాలలు, కేజీబీవీలకు విద్యార్థినులను తీసుకెళ్లి ప్రయోగాలపై శిక్షణ ఇవ్వాలని హెచ్ఎంలకు సెలవిచ్చి మిన్నకుండిపోవడం అధికారుల వంతైంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినులు 5కిలోమీటర్లు వెళ్లిరావడం ప్రయాసతో కూడుకున్న వ్యవహారం కావడంతో కొంతమంది హెచ్ఎంలు మాత్రమే తూతూమంత్రంగా ఒకట్రెండుసార్లు ప్రయోగాలపై శిక్షణ తరగతులు నిర్వహించారని సమాచారం. దీనిపై డీఈవో డాక్టర్ వి.శేఖర్‌ను అడగ్గా హైస్కూల్‌ప్లస్‌లలో సీనియర్ సైన్స్ విద్యార్థినులకు ప్రయోగ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ల్యాబులున్న స్కూల్స్‌లో అక్కడే ప్రాక్టికల్స్ జరిపిస్తున్నామని, మిగిలిన వారికి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగ శిక్షణ నిర్వహించే ఏర్పాట్లు చేశామన్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

తిరుపతి జిల్లాలోని 34మండలాలకు సంబంధించి 25హైస్కూళ్లలో ఇంటర్‌విద్యను అందించేందుకు హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. పాఠశాలవిద్యలో భాగంగా జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో ఇవి నడుస్తున్నాయి. వీటిలో సీనియర్ ఇంటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి ఎంపీసీ గ్రూపులో 79మంది, బైపీసీలో 162మంది విద్యార్థినుల చొప్పున మొత్తం 241మంది చదువుతున్నారు. తొలిఏడాదిలో హైస్కూల్‌ప్లస్‌లలో ఎంపీసీగ్రూపులో ఒక విద్యార్థిని కూడా చేరలేదు.ఎనిమిది స్కూళ్లలో మాత్రమే 79మంది చేరారు. బైపీసీలో 17స్కూళ్లలో విద్యార్థినులు చేరలేదు. 8స్కూళ్లలో 162మంది చేరారు. రెండు సంవత్సరాలూ కలిపి ఈ ఏడాదిలో సీఈసీ, ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో చదువుతున్న మొత్తం విద్యార్థినులు 768మంది ఉన్నట్లు సమాచారం. ఇక గతేడాదిలో ప్రథమ ఇంటర్‌లో సాధించిన ఉత్తీర్ణతశాతం కూడా అంతంతమాత్రంగానే ఉంది. మొత్తంగా 25హైస్కూల్‌ప్లస్‌లలో 18.5శాతంమంది విద్యార్థినులు మాత్రమే పాసవ్వడం గమనార్హం. దీంతో హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్ అడ్మిషన్లను పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పదవతరగతి పూర్తిచేసిన విద్యార్థినులను బలవంతంగా చేర్పించారు. హెచ్ఎంలపై ఒత్తిడి పెంచడంతో పదవతరగతి పూర్తిచేసిన విద్యార్థినులకు టీసీలు ఇవ్వకుండా అక్కడే ప్రవేశాలు కల్పించాల్సి వచ్చింది. ఇంత ఒత్తిడి చేసి చేర్చుకున్న విద్యార్థినులకు అవసరమైన సదుపాయాలు, నాణ్యమైన విద్యను అందించడంలో మాత్రం ప్రభుత్వం చొరవచూపకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

రెడ్డిచెరువులో గల్లంతైన యువకుడి మృతి



గణేష్ మృతదేహాన్ని వెలికితీస్తున్న రెస్క్యూ టీం

ఎర్రావారిపాలెం, జనవరి 24: మండలంలోని రెడ్డిచెరువులో గత ఆదివారం గల్లంతైన చింతగుంట పంచాయతీ ఆది ఆంధ్రవాడకు చెందిన గల్లా గణేష్ (24)మృతి చెందాడు. గ్రామస్తులు చేపల వేటకు వెళుతుండగా వారు వద్దన్నా గణేష్ వినకుండా రెడ్డిచెరువు వద్దకు నాలుగు రోజుల క్రితం వెళ్లి గల్లంతైన విషయం విదితమే. సర్పంచ్ కంచన లోకేష్ తన సొంత ఖర్చులతో తిరుపతి నుంచి గజ ఈతగాళ్ళను, స్పీడ్ బోట్‌లను బుధవారం రప్పించారు. ఉదయం నుంచి చెరువు మొత్తం గాలింపు చేపట్టారు. చెరువులో ఉపాధి హామీ కింద తీసిన గుంతలో చెట్ల మధ్యన గణేష్ మృతదేహం చిక్కుకుని ఉండడంతో వెలికితీశారు. చేపల కోసం నీటిలోకి దిగిన గణేష్ తాగిన మైకం ఉండడంతో బురదలో, చెట్ల మధ్యలో చిక్కుకుని ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. గణేష్ భార్య జయంతి 7 నెలల గర్భిణి. శవపరీక్షల అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గంగుడుపల్లెలో గంగమ్మ జాతర



గంగమ్మను దర్శించుకొంటున్న సైకం జయచంద్రారెడ్డి

చంద్రగిరి, జనవరి 24: చంద్రగిరి మండలం గంగుడుపల్లెలో మంగళవారం రాత్రి గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. గంగమ్మ ప్రతిమను తయారు చేసి, అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున గ్రామస్తులు పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏపీ సివిల్ సప్లై మాజీ ఛైర్మన్, పారిశ్రామికవేత్త సైకం జయచంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ ధర్మారెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువులో చిన్నారి మృతదేహం



చిన్నారి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ హరికృష్ణ

చిట్టమూరు, జనవరి 24: మండల కేంద్రమైన చిట్టమూరు చెరువులో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని ఐదేళ్ల చిన్నారి మృతదేహం లభ్యమైంది. చిట్టమూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు చెరువులో చిన్నారి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ లక్ష్మీభవాని సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. వాకాడు సీఐ హరికృష్ణ చిన్నారి మృతదేహాన్ని పరిశీలించారు. నల్లటి గీతల టీ షర్టు, నిక్కరు ధరించి ఉంది. ముఖం కనిపించకుండా టవల్ చుట్టివుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తనయుడి కోసం తల్లి బుజ్జగింపులు



ఎంపీపీ భాస్కర్‌రెడ్డితో మాట్లాడుతున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి

బాలాయపల్లి, జనవరి 24: వెంకటగిరి నియోజకవర్గ అధికార పార్టీలో అసమ్మతి నేతలను బుజ్జగించేందుకు మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు ఇళ్లకు బుధవారం వెళ్లారు. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక బాలాయపల్లి మండలంలో పెత్తనం సాగిస్తున్న ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావును పక్కనబెట్టి వెందోటి కార్తీక్‌రెడ్డికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అప్పటి నుంచి ఎంపీపీతో పాటు ఏఎంసీ ఛైర్మన్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేథప్యంలో బుధవారం నేదురుమల్లి రాజ్యలక్ష్మి జయంపు, పిగిలాం గ్రామాలకు వెళ్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావుతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు రాంకుమార్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరినట్లు తెలిసింది.

ఈఎస్‌ఐ ఆస్పత్రిలో చుక్క నీరొస్తే ఒట్టు..!



బయటి సంపులో నీటిని క్యాన్లకు నింపుతున్న పారిశుధ్య కార్మికులు

- పది రోజులుగా నీళ్లు లేక రోగులు, సిబ్బంది అవస్థలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

తిరుపతి సిటీ, జనవరి 24 : కార్పొరేట్ స్థాయిలో నిర్మించిన ఈఎస్ఐ ఆస్పత్రి నూతన భవనంలో పది రోజులుగా చుక్కనీరు రాక ఇటు రోగులు అటు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆర్సీ రోడ్డులో ఈఎస్ఐ నూతన భవనాన్ని నిర్మించింది. అయితే అందులో వసతుల కల్పన అంతంత మాత్రంగానే చేశారు. సాధారణంగా కార్పొరేషన్ అందించే నీటిని సంపుల్లో నింపి మోటార్ల సాయంతో ఆస్పత్రి పైన ఉన్న ట్యాంకులను నింపి అక్కడి నుంచి ఆస్పత్రిలోని అన్ని వార్డులకు సరఫరా చేస్తారు. పది రోజుల కిందట సంపులోని నీటిని ట్యాంకులకు సరఫరా చేసే పైపులు పగిలిపోవడంతో నీరు రావడం లేదు. ఆస్పత్రిలో వంద మందికి పైగా సిబ్బంది, 40 మంది వరకు



స్ట్రెచర్‌పై నీటి క్యాన్లను తీసుకువస్తున్న కార్మికులు

ఇన్‌పేషెంట్లతో పాటు 150-200 మంది వరకు అవుట్ పేషెంట్లు ఆస్పత్రిలో ఉంటారు. నీటి సరఫరా లేకపోవడంతో ఇన్‌పేషెంట్లను డిశ్చార్జి చేయడంతో పాటు కొత్తగా వచ్చే రోగులకు అడ్మిషన్లు నిలిపేశారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండి చికిత్స పొందుతున్న వారి కోసం పారిశుధ్య కార్మికులు బయటి నుంచి నీటిని క్యాన్లలో నింపి వార్డులకు మోస్తున్నారు. డాక్టర్లు, సిబ్బంది సైతం అవస్థలు పడుతున్నారు. సంపులోని నీటిని క్యాన్లలో నింపి స్ట్రెచర్లపై లిఫ్టుల ద్వారా పై అంతస్తులకు తీసుకురావాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషయాన్ని ఈఎస్ఐ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆస్పత్రిలో నీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మూడు గంటల్లోపే రూ.300 దర్శన టికెట్ల కోటా పూర్తి

తిరుమల, జనవరి24(ఆంధ్రజ్యోతి):ఏప్రిల్ నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కేవలం 2 గంటల 57 నిమిషాల్లో పూర్తయ్యాయి. ఇప్పటికే ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన రూ.300 దర్శన టికెట్లను విడుదల చేసిన టీటీడీ ఏప్రిల్ నెలకు సంబంధించిన టికెట్లను బుధవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. ఈ క్రమంలో 12.57 గంటలకు టికెట్లను భక్తులు తమకు కావాల్సిన తేదీలు, స్లాట్లలో బుక్ చేసుకున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు విడుదల చేసిన అంగప్రదక్షిణ టోకెన్లను కూడా ఐదు నిమిషాల్లోనే భక్తులు బుక్ చేసుకున్నారు.మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేసిన వృద్ధులు, దివ్యాంగుల దర్శన టోకెన్లు కూడా 16 నిమిషాల్లో పూర్తయ్యాయి.

దర్శన టికెట్లున్న భక్తులకు గదులు

దర్శన టికెట్లున్న భక్తులు మాత్రమే తిరుమల, తిరుపతిల్లో కాటేజీలు పొందేలా టీటీడీ ఈసారి నూతన విధానాన్ని అమలుచేసింది. గతంలో ఆర్జితసేవలు, దర్శన టికెట్లు, టోకెన్లు పొందిన భక్తులు గదులు పొందేందుకు ఇబ్బందులు పడేవారు. తమకు టికెట్లున్నా గదులు లభించడం లేదని కొందరు, తాము రూం బుక్ చేశాం కానీ దర్శన టికెట్లు లభించలేదని మరికొందరు తరచూ టీటీడీకి ఫిర్యాదు చేసేవారు. ఈ క్రమంలో టీటీడీ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. తొలిసారిగా బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేసిన అడ్వాన్స్ రిజర్వేషన్ గదుల కోటాను కేవలం టికెట్లు, టోకెన్లు, ఆర్జితసేవలు పొందిన వారు మాత్రమే పొందేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.అయితే తిరుమలలో యథావిధిగా కరెంట్ బుకింగ్‌లో గదుల కేటాయింపు విధానం కొనసాగనుంది.

ఫ్లెక్సీల ఏర్పాటుపై కొరడా

- గాంధీపురం వైసీపీ నేతలపై పంచాయతీ అధికారుల ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు

తిరుపతి రూరల్, జనవరి 24: అనధికారిక ఫ్లెక్సీల ఏర్పాటుపై పోలీసులు కొరడా ఝుళిపించారు. తిరుపతి రూరల్ గాంధీపురానికి చెందిన వైసీపీ నాయకులు శివ, గురువారెడ్డి, జయకర్‌పై స్థానిక పంచాయతీ కార్యదర్శి కరుణశ్రీ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి సతీమణి లక్ష్మి రెండు రోజులుగా గాంధీపురంలో గడప గడపకూ ఆత్మీయ పలకరింపు పేరుతో పాదయాత్ర చేపట్టారు. ఈ క్రమంలో గాంధీపురం వైసీపీ సర్పంచ్ లక్ష్మి భర్త శివ, వైసీపీ గాంధీపురం పంచాయతీ అధ్యక్షులు గురువారెడ్డి, ఎంపీటీసీ జయకర్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిపై గాంధీపురం పంచాయతీ కార్యదర్శి కరుణశ్రీ ఫిర్యాదు మేరకు వైసీపీ నాయకులు శివ, గురువారెడ్డి, జయకర్‌పై తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా ఏ పార్టీ నాయకులు ఫ్లెక్సీలు, కరపత్రాలు, కటౌట్లు ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి రూరల్ ఎంపీడీవో రమేష్‌బాబు స్పష్టం చేశారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గాంధీపురం పంచాయతీ సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న బెల్లంకొండ మురళి

టీడీపీని బలోపేతం చేద్దాం

భాకరాపేట, జనవరి24: చిన్నగొట్టిగల్లు మండలంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేద్దామని టీడీపీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి పిలుపునిచ్చారు. బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదన మోహన్, ఆర్వీ రమణారెడ్డి, సుబ్రమణ్యం, మోహన్‌రెడ్డి, వెంకటరత్నం, సిద్ధముని, మునిచంద్ర, తులసీరాయల్, డిష్ మణి, ప్రకాష్, విజయ్‌కుమార్, మల్లికార్జునరెడ్డి, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

పాకాల రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



పాకాల, జనవరి 24: పాకాల రైల్వేస్టేషన్‌ను బుధవారం సాయంత్రం గుంతకల్లు రైల్వే డివిజినల్ మేనేజర్ వినీత్ సింగ్ సందర్శించారు. ప్రత్యేక రైలులో వచ్చిన డీఆర్ఎం ఒకటవ, రెండవ ప్లాట్‌ఫాంలలో పాత భవనాల తొలగింపును పరిశీలించారు. ఇక్కడ నిర్వహిస్తున్న కార్యాలయాలను 3వ నెంబరు ప్లాట్‌ఫాంకు షిఫ్టింగ్‌ను పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై స్థానిక అధికారులతో సమీక్షించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించారు.

భాకరాపేట ఘాట్‌లో కారు బోల్తా



భాకరాపేట, జనవరి 24: భాకరాపేట ఘాట్ రోడ్డులో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికి ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. ఎస్ఐ హేమాద్రి కథనం మేరకు తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలం రామాపురానికి చెందిన వెంకటేష్ తన కుటుంబ సభ్యులతో తిరుమల శ్రీవారి దర్శనానికి వెళుతుండగా భాకరాపేట ఘాట్ రోడ్డులో కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారు డ్రైవర్‌తో పాటు 12 మంది ఉన్నారు. ప్రమాదంలో ఎవ్వరికి ఎలాంటి ప్రమాదమూ జరగలేదన్నారు.

కాంగ్రెస్ లోకి షర్మిల రావడాన్ని వైఎస్ తిరిగొచ్చినట్టు భావిస్తున్నాం

- కేంద్రమాజీ మంత్రి పల్లం రాజు

తిరుమల, జనవరి24(ఆంధ్రజ్యోతి): వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లోకి తిరిగి రావడాన్ని వైఎస్ రాజశేఖర్‌రెడ్డే తిరిగి వచ్చినట్టు భావిస్తున్నామని కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. షర్మిల బాధ్యతలు తీసుకోవడం సంతోషకరమన్నారు.ఆమె ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా బలోపేతమవుతుందన్నారు.

సెర్ప్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



నిరసన తెలుపుతున్న సెర్ప్ ఉద్యోగులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 24 : తిరుపతి జిల్లాలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర జేఏసీ కార్యదర్శి ధనంజయరెడ్డి కోరారు. ఈ మేరకు డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. అప్పటివరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాసులు, కుళ్లాయప్ప, వెంకటేశులు, ఉమా తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి నుంచి పోటీ చేస్తున్నా

బడి సుధా యాదవ్ వెల్లడి



తిరుపతి రూరల్, జనవరి 24: వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్టు ఓబీసీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, పుదిపట్ల సర్పంచ్ బడి సుధా యాదవ్ వెల్లడించారు. పుదిపట్లలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను 15 రోజుల పాటు చేపట్టిన ఆత్మీయ కలయిక సంతృప్తినిచ్చిందన్నారు. టీడీపీ అధిష్ఠానం పిలుపు కోసం ఎదురు చూస్తున్నానని, నియోజకవర్గంలోని లక్ష మంది బీసీ ఓటర్లే తన బలమని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన కూటమి బీసీలకు సముచిత స్థానం ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తుడా బల్లలకు, సూచిక బోర్డులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి పేరు ఒక్కటే పెట్టుకోవడం ఏమిటన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ పేర్లు కూడా పెట్టవలసిందని అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులను దూషించడం శోచనీయమన్నారు. జర్నలిస్టులకు తాను అండగా ఉంటానన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులకు భూమి పూజ



భూమి పూజలో సర్పంచ్ జనార్ధన యాదవ్

తిరుపతి రూరల్, జనవరి 24: వేదాంతపురం పంచాయతీ విజయనగర్ కాలనీలో రూ.10 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ పనులను వేదాంతపురం సర్పంచ్ చెరుకుల జనార్ధన్ యాదవ్ భూమి పూజ చేసి ప్రారంభించారు. వినాయక స్వామి ఆలయం నుంచి తెలుగుతల్లి వృద్ధాశ్రమం వరకూ ఈ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పనులు వేగవంతంగా, నాణ్యతగా పూర్తి చేసేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడిస్తారు నీళ్ల బిల్లులు?

- మానాలు పోయాయి.. ఇక ప్రాణాలే మిగిలాయి
- ప్రభుత్వంపై సొంత పార్టీ నేతల ఆగ్రహం
- ఇలాగైతే ఎన్నికల్లో పరిస్థితి ఏంటని వైసీపీలో ఆందోళన
- పలమనేరు నియోజక వర్గంలోనే రూ.10.47 కోట్ల బకాయిలు



రోడ్డు మీదకు రాకుండా కట్టడి చేస్తున్న పోలీసులు

వి.కోట, జనవరి 24: 'ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నీళ్లు తోలాం. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చాం. ఇప్పటికీ మాకు బిల్లులు ఇవ్వలేదు. వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్ వస్తుందంటున్నారు. మాకు ఇంకెప్పుడు ఇస్తారు నీళ్లబిల్లులు' అంటూ వైసీపీకే చెందిన కుప్పం, పలమనేరు నియోజక వర్గాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నేతలు ప్రశ్నిస్తున్నారు. నాలుగున్నరేళ్లుగా బిల్లులివ్వని ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వి.కోటలో బుధవారం సొంత పార్టీవారే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్‌ని అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. సొంత పార్టీ వారికే బిల్లులు ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో తాము ఎలా సమాధానం చెప్పాలంటూ స్థానిక నేతలు చర్చించుకుంటున్నారు. రెండు నియోజక వర్గాలో ఇవ్వాల్సిన రూ.20 కోట్లకు ఇలా ఇబ్బందిపెడితే మరి పంచాయతీల్లో చేసిన రూ.కోట్ల పనులకు బిలులు అందుతాయా అని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక తామంతా ట్యాంకర్లు కొని గ్రామాలకు నీటి సరఫరా చేస్తే బిల్లులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను ఎవరి దృష్టికి తీసుకెళ్లినా స్పందించ లేదన్నారు. ట్రాక్టర్లకు రుణ కంతులు కట్టేందుకు కొందరు బంగారం తాకట్టు పెడితే.. మరికొందరు వాహనాలనే పైనాన్సు వారికి అప్పగించారంటూ ప్రస్తావించారు. ఈ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాకుంటే తమ బిల్లుల మాటేమిటని పలువురు అంటున్నారు.

ప్రాణాలూ తీసేలా ఉందీ ప్రభుత్వం



నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోంది. బంగారం తాకట్టుపెట్టినా అప్పులు తీరలేదు. ఇప్పుడేమో బిల్లుల ఊసే ఎత్తేవారు లేరు. ఎమ్మెల్యే దృష్టికి సమస్య చెబితే పట్టించుకోలేదు. ఇప్పుడు మంత్రికి సమస్య చెప్పాలంటే పోలీసులు అడ్డుతగులుతున్నారు. మేము గెలిపించిన మంత్రిని.. మేము నిలదీస్తే తప్పంటున్నారు. చేసిన అప్పులు తీర్చలేక మానాలు పోయాయి. ఇక మిగిలింది మా ప్రాణాలే..? సకాలంలో బిల్లులు ఇవ్వకుండా వాటినీ తీసేలా ఉంది ప్రభుత్వ తీరు.

- నాగరాజురెడ్డి, వైసీపీ నేత, బైసుకుప్పం, వి.కోట మండలం

బిల్లు అప్‌లోడ్ చేశాం

పలమనేరు నియోజక వర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి రూ.10.47 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. వి.కోట మండలం రూ.4.53 కోట్లు, బైరెడ్డిపల్లె, రూ.1.94 కోట్లు, పలమనేరు రూ.1.68 కోట్లు, పెద్దపంజాణి రూ.1.01 కోట్లు, గంగవరం రూ. 1.29 కోట్ల మేరకు బకాయిలు ఉన్నాయి.

మేమూ వైసీపీ వాళ్లమే.. పట్టించుకునే దిక్కేది?



నేను 2019 నుంచి 23 నెలలు నీళ్లు తోలితే మూడు నెలల బిల్లు వచ్చింది. మిగిలిన రూ.9.5 లక్షల కోసం మూడుసార్లు విజయవాడ వెళ్లినా అపాయింట్‌మెంట్ లేదు. మేము వైసీపీ వాళ్లమే. ఎమ్మెల్సీ భరత్ నుంచి మంత్రి పెద్దిరెడ్డి, సలహాదారు సజ్జల వరకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. విధిలేని పరిస్థితిలో రోడ్డు మీదకు వచ్చాం.

- మునస్వామి, బోయినపల్లె, శాంతిపురం మండలం

సొంత పార్టీ వారిచే మంత్రి వాహనం అడ్డగింత



మంత్రితో మాట్లాడుతున్న బాధితులు

వి.కోటలో బుధవారం సొంత పార్టీ నుంచే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి నిరసన సెగ తగిలింది. నీళ్ల బిల్లుల కోసం ఆయన కారును వైసీపీకి చెందిన మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, నేతలు అడ్డుకున్నారు. నాలుగున్నరేళ్లుగా బిల్లులు ఇవ్వలేదని, ఎన్నిసార్లు చెప్పినా మంత్రి కూడా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సర్దిచెప్పబోయిన వైసీపీ నేతలు, పోలీసులపైనా మండిపడ్డారు. కారులోనే ఉన్న మంత్రి.. తనకు బిల్లులకు సంబంధించి టోకెన్లు ఇస్తే త్వరగా మంజూరు చేయిస్తానంటూ కుప్పం వెళ్లారు. తిరిగొచ్చే సమయంలోనూ మంత్రిని ఆపి మాట్లాడాలని కుప్పం, పలమనేరు నియోజకవర్గాలకు చెందిన.. నీళ్ల బిల్లులు రావాల్సిన వైసీపీ వారు దానమయ్యగారిపల్లె టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. అడ్డుకోబోయిన పోలీసులతోనూ వీరు వాగ్వాదానికి దిగారు. వీరిని చూసి కారు దిగన మంత్రి పెద్దిరెడ్డి.. నీటి బిల్లులు అప్‌లోడ్ చేశారని, త్వరలో బకాయిలు విడుదల చేస్తామని చెప్పారు. ఈ పరిణామం ఎన్నికల నాటికి ఎలా ఉంటుందోనని స్థానిక వైసీపీ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి

● రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 24 : విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం వహించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి కోరారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో 'చదువు - సామాజిక సేవ' అంశంపై బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పద్మావతి యూనివర్సిటీ ప్రత్యేక గుర్తింపును సంతరించుకుంటోందన్నారు. ఇందులో ఇక్కడి అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగుల సమష్టి కృషి ఉందన్నారు. చదువుతో పాటు విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ విస్తృతంగా పాల్గొనాలని సూచించారు. ఎంపిక చేసుకున్న గ్రామంలోని ఒక పాఠశాలలో పది మంది విద్యార్థులకు చదువు ప్రాముఖ్యతను తెలియ చేసి వారిని ప్రోత్సహించాలన్నారు. తద్వారా వారి సామర్థ్యాలను పెంపొందించడానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. వర్సిటీ వీసీ భారతి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ పాల్గొనేలా ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి యూనివర్సిటీ పక్షాన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డిని సత్కరించారు. యూనివర్సిటీ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నందుకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆసరా చెక్కుల పంపిణీ

చంద్రగిరి/పాకాల, జనవరి 24: చంద్రగిరి, పాకాల పట్టణాల్లో వైఎ్ సఆర్ ఆసరా చెక్కులను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. చంద్రగిరిలో రూ.11.61 కోట్ల చెక్కును, రూ.10.47 కోట్ల చెక్కును మహిళా గ్రూపులకు అందజేశారు. చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో బాలాజీనాయక్, ఏపీఎం సరిత, సర్పంచ్ రూపారామ్మూర్తి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో పోలీసుల అత్యుత్సాహం









● స్కూల్ పిల్లలకు తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు
● ఎక్కడికక్కడ బారికేడ్లు



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 24: సీఎం జగన్ బుధవారం తిరుపతికి వచ్చారు. నగర సమీపంలోని తాజ్‌హోటల్‌లో జరిగిన ఇండియా టుడే సమ్మిట్‌కు హాజరయ్యారు. సీఎం పర్యటనలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి తాజ్‌హోటల్ వరకు సీఎం పర్యటించే మార్గాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. హైవే నుంచి తనపల్లి వైపు వెళ్లే మార్గంలో స్వర్ణముఖి నది వరకు రెండు గంటల పాటు వాహనాలను దిగ్బంధించారు. కనీసం పాదచారులను సైతం అనుమతించలేదు. తాజ్‌హోటల్ వైపు ఎవరిని రాకుండా అడ్డుకున్నారు. హోటల్ సమీపంలో ఉన్న ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ఇళ్లకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్కూల్ బస్సులను సైతం అనుమతించలేదు. రోడ్డు పక్కన నిలుచున్న వారిని సైతం తరిమివేశారు. కొంతమంది సీఎంకు వినతిపత్రం ఇవ్వడానికి రోడ్డుపై నిరీక్షించారు. కనీసం సీఎం కాన్వాయ్‌ను ఆపకుండా వెళ్లిపోయారు. హౌస్ అరెస్టు చేసిన జనసేన నాయకులను సీఎం వెళ్లిన తర్వాత వదిలేశారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ ప్రారంభం





తనిఖీ చేసి, విద్యార్థులను కేంద్రంలోకి అనుమతిస్తున్న సిబ్బంది

తిరుపతి(విద్య)జనవరి 24 : జాతీయ స్థాయిలో ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐటీలలో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తిరుపతి, పుత్తూరులోని మూడు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించిన ఈ పరీక్షలకు తొలిరోజు 267మంది విద్యార్థులకుగాను 231మంది రాశారని సిటీ కోఆర్డినేటర్ కైలాష్ పేర్కొన్నారు. కాగా కేంద్రాల వద్దకు చేరుకున్న విద్యార్థులను ఎన్టీఏ నిబంధనల ప్రకారం క్షుణంగా తనిఖీ చేసి, లోపలికి అనుమతించారు.

వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి

తిరుపతి సిటీ, జనవరి 24 : ఆయుష్‌తో పాటు వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా చైర్మన్, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని కోరారు. పలువురు ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి ఆయన బుధవారం విజయవాడలో జవహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఆయుష్, అర్బన్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. స్పందించిన ఆయన ఈ నెలాఖరు లోపు కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ ప్రక్రియను పూర్తి చేస్తామని, మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నేతలు వెంకట్రామిరెడ్డి, అరవపాల్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

ఎస్పీజేఎన్ఎం స్కూల్లో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

తిరుపతి(విద్య) జనవరి 24 : తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ పేరిట నిర్వహిస్తున్న రెండ్రోజుల జాతీయ స్థాయి విద్యా సమ్మేళనానికి హాజరైన వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు బుధవారం ఉదయం నగరంలోని శ్రీపండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు అభివృద్ధి పనులను పరిశీలించారు. తరగతి గదులు, డిజిటల్ బోర్డులు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ట్యాబులు, ఆర్వో సిస్టమ్, జేవీకే వస్తువులు, జగనన్న గోరుముద్ద, మరుగుదొడ్లను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో కొంతసేపు ఇంటరాక్ట్ అయ్యారు. ఐఎఫ్‌పీల ద్వారా నిర్వహించే డిజిటల్ విద్యాబోధనా విధానాన్ని ప్రదర్శించారు. మధ్యాహ్న భోజన సమయం కావడంతో ప్రతినిధులే స్వయంగా విద్యార్థులకు మిడ్ డేమీల్స్‌ని వడ్డించడంతో పాటు భోజనాన్ని రుచి చూశారు. పాఠశాల విద్య ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన మెరుగుపరిచి విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యను అందిస్తున్నామని విశదీకరించారు. మిడ్ డేమీల్స్ డైరెక్టర్ శోభిక, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి, ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి, డీఈవో డాక్టర్ వి.శేఖర్, ఎంఈవో బాలాజీ, హెచ్ఎం మునిశేఖర్, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.





జేవీకే వస్తువులను పరిశీలిస్తున్న ప్రతినిధులు, వివరిస్తున్న ప్రవీణ్ ప్రకాశ్ - పిల్లలకు భోజనం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

వేగం కన్నా ప్రాణం మిన్న

రామచంద్రాపురం, జనవరి 24: వేగం కన్నా ప్రాణం కాపాడుకోవడం ముఖ్యమని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కుసుమ అన్నారు. వెంకట్రామపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం పలు ప్రదర్శనలతో ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ ఎం.సుమలత, బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కుసుమ

దళితులను దగా చేస్తున్న వైసీపీ: నెలవల



చీరలు పంపిణీ చేస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

నాయుడుపేట టౌన్, జనవరి 24: రాష్ట్రంలో దళితులను వైసీపీ దగా చేస్తున్నదని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం పట్టణంలోని ఏటుగట్టు కాలనీవాసులకు తెలుగు మహిళా జిల్లా ఉపాధ్యక్షురాళ్లు సుజాతమ్మ, సుగుణమ్మ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ నగిరి నియోజకవర్గంలో మంత్రి రోజా ఓ దళిత కౌన్సిలర్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇప్పిస్తామని చెప్పి రూ.70 లక్షలు డిమాండ్ చేయడం, రూ.40 లక్షలు తీసుకుని మోసం చేయడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి జగన్ కూడా ఎమ్మెల్యే టిక్కెట్ల కేటాయింపులో దళితులను మోసం చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి దళితులే తగిన గుణపాఠం చెబుతారని నెలవల అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రాజేంద్ర, దార్ల రాజేంద్ర, అవధానం సుధీర్, ముత్యాలయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించాలి



జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గూడూరు, జనవరి 24: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల గురించి నేటితరం విద్యార్థులకు తెలియజెప్పి వారిలో దేశభక్తిని పెంపొందించాలని రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఏబీవీపీ సేవాభారతి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ నుంచి 75 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేసి స్వాతంత్ర్యాన్ని అందించారన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకుడు మల్లికార్జున మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశభక్తిని కలిగివుండాలన్నారు. కార్యక్రమంలో రూపవతి, నిఖిత, చిన్నా, శివశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు మరోసారి మోసపోరు: టీడీపీ

సూళ్లూరుపేట, జనవరి 24: జగన్ మాయమాటలు నమ్మి అధికారం అప్పగించిన మహిళలు మరోసారి మోసపోయేందుకు సిద్ధంగా టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో సీఎం జగన్‌కు అక్కా చెల్లెళ్లమ్మలు గుర్తుకొచ్చారని, అందుకే ఆసరా నిధులు జమ చేశారని అన్నారు. చంద్రబాబు నాయుడు తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడే మహిళా సాధికారిత కోసం అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. పొదుపు గ్రూపులను ప్రారంభించిందెవరో వైసీపీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. టీడీపీ హయాంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించారన్నారు. వైసీపీ పాలనకు చమరగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా టీడీపీ ప్రభంజనం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, బుద్ధి విజయలక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుమలలో పుష్యమాస పౌర్ణమి గరుడసేవ

తిరుమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పుష్యమాస పౌర్ణమి సందర్భంగా తిరుమలలో గురువారం రాత్రి గరుడసేవ నిర్వహించనున్నారు. ప్రతినెలా పౌర్ణమి రోజున టీటీడీ గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాత్రి 7 నుంచి 9గంటల వరకు మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రామకృష్ణతీర్థ ముక్కోటి

తిరుమలలో గురువారం రామకృష్ణతీర్థ ముక్కోటి నిర్వహించనున్నారు. తిరుమలకు ఆరు మైళ్ల దూరంలో ఉన్న ఈ తీర్థంలో ముక్కోటిని పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమిరోజున శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. స్కంద పురాణం ప్రకారం పూర్వకాలంలో రామకృష్ణుడు అనే మహర్షి వేంకటాద్రిపై తపస్సు చేసి, స్నానమాచరించడానికి ఈ తీర్థాన్ని రూపొందించు కున్నారు. ఇందులో స్నానమాచరించడం వల్ల అజ్ఞానంతో తల్లిదండ్రులు, గురువులను దూషించడం వల్ల కలిగే దోషాల నుంచి విముక్తి లభించి, సుఖంగా జీవిస్తారని ప్రాశస్త్యం. గురువారం ఉదయం నుంచి భక్తులను తీర్థానికి అనుమతించనున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి అనుమతి లేదని టీటీడీ స్పష్టం చేసింది. కాగా గోగర్భం డ్యామ్ పాయింట్ నుంచి పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ఆర్టీసీ దాదాపు 35 బస్సులను ఏర్పాటు చేసింది. భక్తుల సౌకర్యార్థం టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో పాలు, కాఫీ, పొంగళి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

బైక్ కాల్చివేతపై ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, జనవరి 24: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న చరణ్ తన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చివేశారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం రాత్రి ఇంటి ముందు పార్క్ చేసిన బుధవారం ఉదయం లేచిచూసే కాలిపోయి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఎస్ఈబీ సీఐగా శ్రీనివాసులు



వాకాడు, జనవరి 24: వాకాడు ఎస్ఈబీ సీఐగా డి.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో బాపట్లలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు ఎస్ఈబీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

రోజాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 24: మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని దళిత మహిళను మోసం చేసిన రోజాను మంత్రి పదవి నుంచి తొలగించాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుత్తూరు పురపాలక సంఘం ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలిచిన భువనేశ్వరిని చైర్‌పర్సన్ చేస్తానని ఆమె నుంచి మంత్రి రోజా రూ.70లక్షలు డిమాండ్ చేయడం దుర్మార్గమన్నారు. దళిత మహిళ అయిన భువనేశ్వరి రూ.40లక్షలు ఇచ్చినా చైర్‌పర్సన్ పదవి ఇవ్వకపోగా, ఇచ్చిన డబ్బులను ఆమెకు తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడడం మంచిపద్ధతి కాదన్నారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపించి మంత్రిపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. వైసీపీలో మొత్తం అవినీతిపరులు, రౌడీలు, స్మగ్లర్లే ఉన్నారని ఆరోపించారు. వైసీపీ పాలనంతా అరాచకమేనని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దాడులు, దోపిడీ తప్ప అభివృద్ధి జాడే కనిపించడంలేదని విమర్శించారు. ఇక సంక్షేమ పేరుతో సీఎం జగన్ జనాన్ని దోచుకుంటున్నారని అన్నారు. వైఎస్సార్ ఆసరా ఓ పెద్ద టోకరా పథకం అని ఎద్దేవా చేశారు. గత టీడీపీ ప్రభుత్వంతో 1.24కోట్ల మంది డ్వాక్రా మహిళలకు ఒక్కొక్కరికీ రూ.20వేలు ఇవ్వడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం కేవలం 74లక్ష మందికి మాత్రమే ఒక్కొక్కరికీ రూ.15వేలు ఇస్తూ ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటోందని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ వైసీపీని చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోను శివకుమార్, కోటేశ్వరరావు, గురవయ్య, చిరంజీవి, మల్లికార్జున, సురేంద్ర, సునీల్, సందీప్, నాగార్జున, వెంకటసాయి, భారతి, శైలజ, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



హెల్త్ కార్డులను అందజేస్తున్న నరేంద్రరెడ్డి, సర్పంచు శివకుమార్

పెళ్లకూరు, జనవరి 24: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జీలపాటూరు, చిల్లకూరు, రోసనూరు, సీఎన్‌పేట గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర రాష్ట్ర కోఆర్డినేటర్ సూరిపాకల మునిసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఉజ్వల పథకం కింది గ్యాస్ కనెక్షన్లతో పాటు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కందమూడి శివకుమార్, ఎంపీడీవో సురేష్ బాబు, ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, ఏవో గొడవర్తి ప్రవీణ, బీజేపీ మండల అధ్యక్షుడు గోగుతొట్టి మురళి, నాయకులు బిరదవాడ మునిచంద్ర, పంచాయతీ కార్యదర్శి సమ్మన శ్రీహరి, హౌసింగ్ ఏఈ వెంకయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

నాయుడుపేట టౌన్, జనవరి 24: నాయుడుపేట - అయ్యప్పరెడ్డిపాళెం స్వర్ణముఖినది బ్రిడ్జి సమీపంలో మోటారు సైకిల్‌ను లారీ ఢీకొన్న ఘటనలో మదన్‌మోహన్ నాయుడు(45)మృతి చెందాడు. నెల్లూరులో ఓ కంపెనీలో మెడికల్ రెప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న మదన్‌మోహన్ నాయుడు బుధవారం మోటారు సైకిల్‌పై నాయుడుపేటకు వెళ్తుండగా స్వర్ణముఖినది బ్రిడ్జి సమీపంలో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మదన్‌మోహన్ నాయుడు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో చిన్నారి మృతదేహం



చిన్నారి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ హరికృష్ణ

చిట్టమూరు, జనవరి 24: మండల కేంద్రమైన చిట్టమూరు చెరువులో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని ఐదేళ్ల చిన్నారి మృతదేహం లభ్యమైంది. చిట్టమూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు చెరువులో చిన్నారి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ లక్ష్మీభవాని సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. వాకాడు సీఐ హరికృష్ణ చిన్నారి మృతదేహాన్ని పరిశీలించారు. నల్లటి గీతల టీ షర్టు, నిక్కరు ధరించి ఉంది. ముఖం కనిపించకుండా టవల్ చుట్టివుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తనయుడి కోసం తల్లి బుజ్జగింపులు



ఎంపీపీ భాస్కర్‌రెడ్డితో మాట్లాడుతున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మి

బాలాయపల్లి, జనవరి 24: వెంకటగిరి నియోజకవర్గ అధికార పార్టీలో అసమ్మతి నేతలను బుజ్జగించేందుకు మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు ఇళ్లకు బుధవారం వెళ్లారు. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి బాధ్య తలు చేపట్టాక బాలాయపల్లి మండలంలో పెత్తనం సాగిస్తున్న ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావును పక్కనబెట్టి వెందోటి కార్తీక్‌రెడ్డికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అప్పటి నుంచి ఎంపీపీతో పాటు ఏఎంసీ చైర్మన్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నేదురుమల్లి రాజ్యలక్ష్మి జయంపు, పిగిలాం గ్రామాలకు వెళ్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావుతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు రాంకుమార్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరినట్లు తెలిసింది.

రేపు రక్తదాన శిబిరం

నాయుడుపేట, జనవరి 24: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని శ్రీవేమ విద్యాసంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం తమ సంస్థల ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత రక్తదానం చేయాలని కోరారు.

ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఉపసర్పంచు విజయసారథిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్

కోట, జనవరి 24: మండల పరిధిలోని గూడలి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపసర్పంచు పల్లెమల్లు విజయసారధిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

కోట, జనవరి 24: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అభివృద్ధి ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 21 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, 16 సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, నిధుల వినియోగంపై అవగాహన కల్పించారు.

పర్యావరణ సహిత పొయ్యిల పంపిణీ

గూడూరు, జనవరి 24: మండలంలోని పాలిచెర్ల గ్రామంలో బుధవారం ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ సహిత పొయ్యిలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, విజయభాస్కర్‌రెడ్డి, మస్తానమ్మ, గోపాల్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీపీ ప్రకృతి కుమార్

సూళ్లూరుపేట, జనవరి 24: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతి కుమార్ అన్నారు. బుధవారం స్థానిక బాలికల గురుకులంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ట్రైనీ డీఎస్పీ సింధుపూజ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.

ప్రతి రైతూ ఈక్రాప్ నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచు శ్రీనివాసన్

తడ, జనవరి 24: తడ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొలవి రఘురెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. వ్యవసాయశాఖ ఏవో కాంచన మాట్లాడుతూ మండలంలో సుమారు 6,800 ఎకరాల్లో వరి, 135 ఎకరాల్లో వేరుశనగ పంటలను రైతులు సాగు చేశారన్నారు. రామాపురం సర్పంచు శ్రీనివాసన్ అడిగిన వివరాలకు ఏవో సమాధానమిస్తూ ప్రతి రైతూ తప్పనిసరిగా ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఎంపీడీవో ఆమోస్‌బాబు మాట్లాడుతూ ఏడుగురు వెటర్నటీ అసిస్టెంట్లు నాలుగు నెలలుగా విధులకు గైర్హాజరు అవుతున్నారని, వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. తహసీల్దారు జయజయరావు మాట్లాడుతూ ఏడు గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, ఈ నెలాఖరులోగా ఇరకం, వేనాడు గ్రామాల్లో రీసర్వే పూర్తి చేస్తామని తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్, రమేష్, హౌసింగ్, విద్యుత్ ఏఈలు సత్యనారాయణ, మురళి, ఎంఈవో మల్లికార్జున, డాక్టర్లు కిషోర్, మస్తానయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేళకు తెరుచుకోని సచివాలయం



ఉదయం 11.30 గంటలు అవుతున్నా తెరుచుకోని వార్డు సచివాలయం

పుత్తూరు అర్బన్, జనవరి 24: పట్టణంలోని సచివాలయాలు ఎప్పుడు తెరుచుకుంటాయో, ఎప్పుడు మూసివేస్తారో తెలియడం లేదని సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్, సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్ మండిపడ్డారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న వార్డు సచివాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 11.30 గంటలు అవుతున్నా సచివాలయం మూసివేసి ఉండడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే పట్టణవాసులకు సేవలు అందించాల్సిన సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోవడం ఆక్షేపణీయమన్నారు. సిబ్బంది తమ ఇష్టానుసారం రావడం... అడిగితే ఫీల్డ్‌వర్క్ అని చెప్పడం తప్ప ప్రజలకు ఎలాంటి సేవలు అందించడంలేదన్నారు. గతంలో కూడా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సచివాలయ సిబ్బంది వేళకు రావడంలేదని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది కార్యాలయ పనివేళల్లో ఉండి స్థానికులకు సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

30న వాహనాల వేలం

తిరుపతి (రవాణా), జనవరి 24: తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలలో ఉన్న వాహనాలను ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నామని, పాల్గొనదలచినవారు ధరావత్తు రూ.5వేలు నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి రవాణాశాఖ అధికారి ఆదినారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళం డిపోలో 3 మ్యాక్సీక్యాబ్‌లు, ఒక ఐచర్, ఒక మహీంద్ర, టాటా గూడ్స్ వాహనాలు, శ్రీకాళహస్తి డిపోలో 2 మహీంద్ర ఆటోలు, 1 బజాజ్ ఆటో, 1 మహీంద్ర మ్యాక్సీ క్యాబ్, 1 మోటారు క్యాబ్ ఉన్నాయని తెలిపారు.

పుత్తూరు వార్తలు

టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ధనపాల్



పుత్తూరు అర్బన్, జనవరి 24: టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీలో పుత్తూరు మండలం శిరుగురాజు పాళెంకు చెందిన మాజీ ఎంపీటీసీ ధనపాల్‌కు చోటు దక్కింది. ఆయనను రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమిస్తున్నట్లు ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ధనపాల్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. దళితులకు పెద్దపీట వేసే ఏకైక పార్టీ టీడీపీనేని స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, టీడీపీ నాయకుడు పోతుగుంట విజయబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ముద్దుకృష్ణమ ఆశయాలను కొనసాగిస్తా: భానుప్రకాష్



కరపత్రాలు అందజేస్తున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 24: తన తండ్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఆశయాలను తాను కొనసాగిస్తానని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భాను ప్రకాష్ తెలిపారు. బుధవారం 22వ వార్డు పరిధిలోని ఆరేటమ్మ కాలనీలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గాలి జీవరత్నంనాయుడు, యూనిట్ ఇన్‌చార్జి రావిళ్ల మాధవనాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని జనసేన నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ పుత్తూరు విద్య, రవాణా, వాణిజ్యపరంగా అభివృద్ధి సాధించింది ముద్దుకృష్ణమనాయుడు కృషి ఫలితంగానేనని స్పష్టం చేశారు. శాంతి భద్రతల విషయంలో రాజీలేని ధోరణి అవలంభించారని, అందుకే పుత్తూరు ప్రశాంత పట్టణంగా పేరు తెచ్చుకుందని గుర్తుచేశారు. ఈ ఐదేళ్ల కాలంలో పుత్తూరు బ్రాండ్ ఇమేజ్‌కు తీవ్ర విఘాతం కలిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఎక్కడికక్కడ రౌడీ మూకలు చెలరేగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్లు అధికార పార్టీకి గెస్ట్‌హౌస్‌లుగా మారిపోయాయని దుమ్మెత్తిపోశారు. బలహీనులు, మహిళలపై వరుసగా దాడులు జరుగుతున్నా వ్యవస్థలు చేష్టలుడిగి చూస్తున్నాయని మండిపడ్డారు. పుత్తూరు ప్రజలకు తిరిగి ప్రశాంత పుత్తూరు కావాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆశీర్వదించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పుత్తూరు సమాజాన్ని చీడపురుగుల్లా పట్టిపీడిస్తున్న రౌడీమూకలను ఉక్కుపాదం మోపి అణిచివేస్తామని ఆరేటమ్మకాలనీ వాసులకు హామీ ఇచ్చారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాల ద్వారా విస్తృతప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి భాను ప్రకాష్‌కు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. మహిళలు మంగళహారతులు పట్టి కర్పూర నీరాజనాలిచ్చారు. యువకులు దుశ్శాలువలు, పూలదండలతో గాలి భానుప్రకాష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ధనపాల్, మండల అధ్యక్షుడు రవికుమార్, వార్డు అధ్యక్షుడు కన్నన్, బీసీ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు అన్బు, తెలుగు యువత రాష్ట్ర కోఆర్డినేటర్ డీజీ ధనపాల్, కరుణాయాదవ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మెరుపుల మహేష్, నాయకులు జి.బాబు, బాబునాయుడు, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పదవులను అమ్ముకోవడం దుర్మార్గం: తెలుగు మహిళలు



లక్ష్మీప్రసన్న, హేమావతి

వడమాలపేట, జనవరి 24: పుత్తూరు మున్సిపల్ చైర్మన్ పదవి కోసం బేరసారాలు చేస్తూ కౌన్సిలరు చేత డబ్బులు తీసుకోవడం దారుణమని, ఇందుకు బాధ్యురాలైన మంత్రి రోజాను ప్రభుత్వం బర్తరఫ్ చేయాలని చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, మండల ప్రధాన కార్యదర్శి హేమావతి డిమాండ్ చేశారు. వడమాలపేటలో బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ వైసీపీ గురించి గొప్పులు చెప్పుకుంటూ... ప్రతిపక్షాలను నోటికొచ్చినట్లు విమర్శించే మంత్రి రోజా పదవులను అమ్ముకోవడం సిగ్గుచేటన్నారు. నిజాయితీ, నిస్వార్థంగా ప్రజాసేవ చేసే నాయకులను విమర్శించే రోజా తన అవినీతి గురించి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రోజాకు ఏ మాత్రం సిగ్గున్నా మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

బాలికలకు సామాజిక, సాధికారిక స్వాతంత్రం కల్పించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న చంద్రమోహన్

వడమాలపేట, జనవరి 24: నేటి పరిస్థితుల్లో బాలికలను సామాజిక, సాధికారిక స్వాతంత్రం కల్పించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ చంద్రమోహన్ కోరారు. బుధవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక బాలిక ఉన్నత పాఠశాలలో బాలికలకు హక్కులు, విధుల గురించి వివరించారు. 2008లో పార్లమెంట్ బాలికల అవశ్యకతపై చట్టం రూపొందించి అమల చేస్తోందన్నారు. బాలికల ఉన్నతి, వారి ఎదుగుదల కోసం అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీహెచ్‌వో పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీలను బానిసలను చేసిన వైసీపీ భూస్థాపితమే

నరసింహయాదవ్



బీసీ గర్జనలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పిచ్చాటూరు, జనవరి 24: బీసీలను బానిసలుగా అణిచివేసిన వైసీపీకి రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారని తిరుపతి జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంకేటీ మండపంలో జయహో బీసీ గర్జన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ప్రాధాన్యత లభించిందన్నారు. వైసీపీ నాలుగున్నర ఏళ్ల పాలనలో బీసీ సంక్షేమం కోసం ఒక పథకాన్ని కూడా అమలు చేయలేదని మండి పడ్డారు. నియోజకవర్గ ఇన్‌చార్జి హెలెన్, ఏఎంసీ మాజీ ఛైర్మన్, ప్రస్తుత క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం, బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, పాలేగార్ సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. నాగలాపురంలో జరిగిన జయహో బీసీ గర్జన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, పార్థిబన్ పాల్గొన్నారు.

రైతు ర్యాలీని జయప్రదం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న రామా నాయుడు

శ్రీకాళహస్తి, జనవరి 24: శ్రీకాళహస్తిలో ఈనెల 26న జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జిల్లా రైతు సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ... గణతంత్ర దినోత్సవం సందర్భంగా అఖిల భారత రైతు సంఘాల పిలుపుమేరకు శ్రీకాళహస్తిలో రైతు ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు. జిల్లా నలు మూలల నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు.హేమలత, జనార్దన్, అంగేరి పుల్లయ్య, జనమాల గురవయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రం సుభిక్షం



శ్రీకాళహస్తి, జనవరి 24: టీడీపీ పాలనతోనే రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లుతుందని మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని ఆమె స్వగృహంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ పాలనలో అరాచకాలు తప్ప అభివృద్ధిపై ఒక అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. అన్ని మతాల పేదలకు టీడీపీ పాలనలో చంద్రన్న కానుకలు పంపిణీ జరిగినట్లు గుర్తు చేశారు. ఆ రోజుల్లో నిరుపేదలు పండుగను ఎంతో సంతోషంగా జరుపుకునే వారని చెప్పారు. మహోన్నత దార్శనిక నేత చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజలు వచ్చే ఎన్నికల్లో మార్పు కోరుతున్నారన్న అభిప్రాయం వ్యక్తం చేశారు.

టీచర్ సురేష్‌కు అంబేడ్కర్ పురస్కారం

శ్రీకాళహస్తి, జనవరి 24:శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు సురేష్ శుక్రవారం అంబేడ్కర్ ప్రతిభా పురస్కారం అందుకోనున్నారు.అధునాతన డిజిటల్ విద్యను రూపొందించిన సురేష్‌కు గుంటూరుకు చెందిన కేవీర్, జయలక్ష్మి విద్యాసంస్థలు ఈ పురస్కారాన్ని ప్రకటించాయి.

పరోక్ష సేవగా రాహుకేతు పూజ

శ్రీకాళహస్తి, జనవరి 24: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహుకేతు సర్ప దోష నివారణ పూజను పరోక్ష సేవగా ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటనలో వెల్లడించారు. ఆలయానికి నేరుగా వచ్చి రాహుకేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకోలేని భక్తుల కోసం పరోక్ష విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రోజూ రాహుకాల సమయంలో ముందుగా ఆన్లైన్ ద్వారా నగదు చెల్లించి పూజలను ప్రసారమాధ్యమాల ద్వారా వీక్షిస్తూ పరోక్షంగా జరుపుకోవచ్చని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయ్‌కుమార్

ఏర్పేడు, జనవరి 24: ఏర్పేడు మండలం పల్లంపేట వద్ద బుధవారం ఆర్టీసీ డ్రైవర్ విజయకుమార్‌పై దాడి జరిగింది.బాధితుడి కథనం మేరకు...శ్రీకాళహస్తి మండలం గోవిందరావుపల్లికి చెందిన విజయకుమార్ వెంకటగిరి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం ఉదయం వెంకటగిరి నుంచి తిరుపతికి వస్తుండగా పల్లంపేట వద్ద ఒక వృద్ధురాలి కోసం బస్సు ఆపాడు.వెనుక వస్తున్న శ్రీకాళహస్తి మండలం గంగలపూడికి చెందిన ఓ ఆటో డ్రైవర్ బస్సు ముందుకెళ్లి అడ్డంగా నిలిపాడు. స్టాపింగ్ లేని చోట బస్సు ఆపితే వెనుక వచ్చే వాహనాల పరిస్థితి ఏమిటంటూ గొడవకు దిగాడు. ఈ సందర్భంగా వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా ప్రయాణికుల జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు. బస్సు తిరిగి వెంకటగిరికి వెళుతుండగా ఆటోడ్రైవర్ తన ముగ్గురు స్నేహితులతో కలిసి పల్లంపేట వద్ద బస్సులోకి చొరబడి విజయకుమార్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన విజయకుమార్‌ను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.వెంకటగిరి డిపో అధికారులు ఫిర్యాదు చేయడంతో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఏర్పేడు ఎస్ఐ జిలానీ తెలిపారు.

కులగణన సర్వేలో సిబ్బంది

● బోసిపోయిన సచివాలయాలు



బీఎన్‌కండ్రిగ సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 24: సచివాలయ సిబ్బంది కులగణన సర్వేకి వెళ్లడంతో మండలంలో సచివాలయాలు బోసిపోయాయి.పనుల మీద వచ్చే ప్రజలు సిబ్బంది కోసం ఎదురు చూడవలసి వస్తోంది.సచివాలయంలో కనీస సిబ్బందిని అయినా అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పుల తడకల ఓటర్ జాబితా మాకొద్దు



కేవీబీపురం, జనవరి 24: కేవీబీపురం మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో 20సంవత్సరాల క్రితం గ్రామం విడిచి వెళ్ళిపోయిన వారి పేర్లను ఓటరు జాబితాలో తొలగించకపోవడం దారుణమని సర్పంచ్ దొర బాబు నాయుడు విమర్శించారు. అధికార పార్టీ అండదండలతో వారిని తొలగించకుండా జాబిత విడుదల చేశారని విమర్శించారు.తాము గ్రామం విడిచి వెళ్లిన వారి పేర్లు తొలగించాలని కోరినా పట్టించుకోలేదన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ప్రయాణికుల రక్షణే లక్ష్యం

శ్రీకాళహస్తి, జనవరి 24: ప్రయాణికుల రక్షణే లక్ష్యంగా డ్రైవర్లు అప్రమత్తంగా వాహనాలు నడపాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు అంజూరు శ్రీనివాసులు సూచించారు.శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బుధవారం డ్రైవర్స్ దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు.డిపో మేనేజర్ రాజవర్ధన్ రెడ్డి, యూనియన్ నాయకుడు శ్రీనివాస కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు సీఐగా దివాకర్‌రెడ్డి



సత్యవేడు, జనవరి 24: సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దివాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన శివకుమార్‌రెడ్డి ఇటీవల నంద్యాల రూరల్ సీఐగా బదిలయ్యారు. దీంతో శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న దివాకర్‌రెడ్డిని సత్యవేడు సీఐగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సత్యవేడు, వరదయ్యపాళెం, నాగలాపురం మండలాల్లో ఇసుక, మట్టి, మద్యం, అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి, తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వరదయ్యపాళెం ఎస్ఐగా ప్రతాప్



వరదయ్యపాళెం, జనవరి 23: వరదయ్యపాళెం ఎస్ఐగా ప్రతాప్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నంద్యాల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ నాగార్జునరెడ్డి బదిలీపై అన్నమయ్య జిల్లాకు వెళ్లారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కండి

వరదయ్యపాళెం, జనవరి 24: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ పిలుపునిచ్చారు. వరదయ్యపాళెంలో గురువారం ఏఐటీయూసీ నియోజకవర్గ ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్డిగా తల ఊపుతోందని విమర్శించారు.వైఎస్ మణి, అన్నాదొరై, చంద్ర, నాగార్జున, కతారి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో చీడల నివారణ

శ్రీకాళహస్తి, జనవరి 24: అప్రమత్తతతో వరిలో చీడలను నివారించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీ భాస్కరయ్య తెలిపారు. శ్రీకాళహస్తి మండలం పెద్దమిట్ట కండ్రిగలో బుధవారం రైతులతో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం ఉన్న చలి వాతావరణంతో వరిలో జింకు లోపం, అగ్గి తెగులు, దోమపోటు, మాని పండు తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. తొలి దశలోనే గుర్తించి పైరుకు పరిమితంగా నీరు పెట్టాలని తెలిపారు.శ్రీకాళహస్తి డివిజన్ ఏడీ రమేష్ రెడ్డి,జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాలరావు, సర్పంచు బాలిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి సుధాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భరద్వాజతీర్థంలో తెప్పోత్సవాలు నిర్వహించండి

శ్రీకాళహస్తి, జనవరి 24: భరద్వాజ తీర్థం పుష్కరిణిలో తెప్పోత్సవ వేడుకలను పున: ప్రారంభించాలని హిందూ ధార్మిక మండలి సభ్యుడు గరికపాటి రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు.బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు.ప్రధాన అర్చకులతో చర్చించి చర్యలు తీసుకుంటామని శ్రీనివాసులు తెలిపారు.

వరవకాలువకు అడ్డంగా వంతెన నిర్మాణం

● లబోదిబోమంటున్న జంగాలపల్లి రైతులు



వెంకటగిరి జాతీయ రహదారిపై జంగాలపల్లి వద్ద నిరసన తెలుపుతున్న జంగాలపల్లి గ్రామస్థులు

ఏర్పేడు, జనవరి 24: ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలోని ఐసర్ వద్ద వెంకటగిరి వెళ్లే జాతీయ రహదారిపై అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడంపై స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రీయ విద్యాసంస్థ అయిన ఐసర్‌కు జంగాలపల్లి వద్ద వెంకటగిరికి వెళ్లే రహదారికి ఇరువైపులా భవనాలు, హాస్టల్ భవనాలు, క్యాంపస్‌లు ఉన్నాయి. ఈ క్రమంలో రోడ్డుకు ఇటుపక్క క్యాంపస్‌లో ఉన్న విద్యార్థులు అటుపక్క కళాశాల భవనాలకు వెళ్లడానికి వీలుగా అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నారు.ఈ క్రమంలో రోడ్డు అనుకుని జంగాలపల్లి చెరువులోకి వెళుతున్న వరవకాలువను పూడ్చివేశారు. దీని వల్ల జంగాలపల్లి చెరువు కింద ఉన్న పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. అంతే కాకుండా ఏర్పేడు మండలంలో వెళుతున్న ఎస్ఎస్ కెనాల్‌ను కలిపి ఉన్నారు. వరవకాలువ పూడ్చడం వల్ల భవిష్యత్తులో జంగాలపల్లి చెరువుకు నీరు చేరే అవకాశం లేదు. నేషనల్ హైవే అధికారులు చొరవ తీసుకుని జంగాలపల్లి చెరువులోకి వెళ్లే వరవకాలువను యధావిధిగా వదిలిపెట్టాలని గ్రామస్థు లు కోరుతున్నారు. దీనిపై సర్పంచ్ బొర్రా నారాయణ ఆధ్వర్యంలో జంగాలపల్లి గ్రామస్థులు బుధవారం ఉదయం బ్రిడ్జి నిర్మాణ పనుల వద్ద నిరసన చేపట్టారు.

మూడు గంటల్లోపే రూ.300 దర్శన టికెట్ల కోటా పూర్తి

తిరుమల, జనవరి24(ఆంధ్రజ్యోతి):ఏప్రిల్ నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కేవలం 2 గంటల 57 నిమిషాల్లో పూర్తయ్యాయి. ఇప్పటికే ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన రూ.300 దర్శన టికెట్లను విడుదల చేసిన టీటీడీ ఏప్రిల్ నెలకు సంబంధించిన టికెట్లను బుధవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. ఈ క్రమంలో 12.57 గంటలకు టికెట్లను భక్తులు తమకు కావాల్సిన తేదీలు, స్లాట్లలో బుక్ చేసుకున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు విడుదల చేసిన అంగప్రదక్షిణ టోకెన్లను కూడా ఐదు నిమిషాల్లోనే భక్తులు బుక్ చేసుకున్నారు.మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేసిన వృద్ధులు, దివ్యాంగుల దర్శన టోకెన్లు కూడా 16 నిమిషాల్లో పూర్తయ్యాయి.

దర్శన టికెట్లున్న భక్తులకు గదులు

దర్శన టికెట్లున్న భక్తులు మాత్రమే తిరుమల, తిరుపతిల్లో కాటేజీలు పొందేలా టీటీడీ ఈసారి నూతన విధానాన్ని అమలుచేసింది. గతంలో ఆర్జితసేవలు, దర్శన టికెట్లు, టోకెన్లు పొందిన భక్తులు గదులు పొందేందుకు ఇబ్బందులు పడేవారు. తమకు టికెట్లున్నా గదులు లభించడం లేదని కొందరు, తాము రూం బుక్ చేశాం కానీ దర్శన టికెట్లు లభించలేదని మరికొందరు తరచూ టీటీడీకి ఫిర్యాదు చేసేవారు. ఈ క్రమంలో టీటీడీ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. తొలిసారిగా బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేసిన అడ్వాన్స్ రిజర్వేషన్ గదుల కోటాను కేవలం టికెట్లు, టోకెన్లు, ఆర్జితసేవలు పొందిన వారు మాత్రమే పొందేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.అయితే తిరుమలలో యధావిధిగా కరెంట్ బుకింగ్‌లో గదుల కేటాయింపు విధానం కొనసాగనుంది.

చైతన్యపురంలో క్యాన్సర్ వైద్యశిబిరం

రేణిగుంట,జనవరి24:రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ పరిధిలోని చైతన్యపురం ఎస్టీ కాలనీలో బుధవారం ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహించారు.రాస్ మహిళా జ్యోతి,టాటా క్యాన్సర్ ఆసుపత్రి, మహిళా యూనివర్సిటీ స్టడీసెంటర్ సంయుక్తంగా ఈ వైద్యశిబిరం నిర్వహించాయి.హాజరైన మహిళలకు క్యాన్సర్ నివారణ పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.పురుషులకు మధుమేహం,రక్తపోటు తదితర పరీక్షలు చేశారు.వైద్యులు వెంకయ్యబాబు,హేమంత్‌కుమార్,రెడ్డికుమారి,మెహతాజ్,అమరావతి,రాస్ కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు,రమేష్‌రెడ్డి,స్టడీసర్కిల్ నిర్వాహకులు,హైమావతి,గిరిప్రసాద్,జ్యోతి,నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లోకి షర్మిల రావడాన్ని వైఎస్ తిరిగొచ్చినట్టు భావిస్తున్నాం

కేంద్రమాజీ మంత్రి పల్లం రాజు

తిరుమల, జనవరి24(ఆంధ్రజ్యోతి): వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లోకి తిరిగి రావడాన్ని వైఎస్ రాజశేఖర్‌రెడ్డే తిరిగి వచ్చినట్టు భావిస్తున్నామని కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. షర్మిల బాధ్యతలు తీసుకోవడం సంతోషకరమన్నారు.ఆమె ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా బలోపేతమవుతుందన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం తగదు :టీడీపీ



సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న గురవారెడ్డి

ఏర్పేడు, జనవరి 24: విద్యార్థుల జీవితాలతో ముఖ్యమంత్రి జగన్ చెలగాటమాడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి మండిపడ్డారు. ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్ద ఉన్న కేంద్రీయవిద్యాసంస్థ ఐసర్ ముందు బుధవారం ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సెల్ఫీ చాలెంజ్ ద్వారా వైసీపీ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో రెండు కేంద్రీయ విద్యాసంస్థలు అయిన ఐసర్, ఐఐటీలను ఏర్పేడు మండలానికి తీసుకువచ్చారన్నారు. దీంతో ఏర్పేడు మండలం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు.అయితే వైసీపీ పాలనలో ఐసర్ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. భవనాలు అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు అసౌకర్యాల మధ్య చదువుకుంటున్నారన్నారు. చంద్రబాబు దూరదృష్టితో ఏర్పాటు చేసిన భవనాల్లో ఇప్పటికీ కనీస వసతులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. టీడీపీ నాయకులు మునెయ్య, రమణ, సుబ్బరామిరెడ్డి, సోముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

శ్రీకాళహస్తి, జనవరి 24: సామాజికంగా వెనుకబడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని నాగమల్లేశ్వరరావు డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్ రజకుల ఎస్సీ సాధన మహా పాదయాత్ర తిరుపతి నుంచి విజయవాడకు బయల్దేరింది. ఈ క్రమంలో బుధవారం పాదయాత్ర శ్రీకాళహస్తికి చేరుకుంది. పట్టణానికి చెందిన బాలసుబ్రమణ్యం స్వాగతం పలికి శేష వస్త్రంతో సత్కరించారు.

ఒలంపియాడ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ





విద్యార్థులను అభినందిస్తున్న జనార్దన రావు - విద్యార్థులను అభినందిస్తున్న మాధురి

శ్రీకాళహస్తి, జనవరి 24: జాతీయ గణిత ఒలంపియాడ్ పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. పట్టణంలోని బీపీ అగ్రహారానికి చెందిన మోనాశ్రీ ట్యుటోరియల్స్ తరఫున పోటీల్లో పాల్గొన్న లిఖిత్, దనుష్య, బంగారు పతకాలు సాధించారు. ట్యుటోరియల్ నిర్వాహకురాలు వినుకొండ మాధురి వారిని అభినందించారు. పట్టణానికి చెందిన ది స్కూల్ విద్యార్థులు 35 మంది బంగారు పతకాలు సాధించారు. పాఠశాల కరస్పాండెంటు జనార్దన రావు పవార్ బుధవారం విద్యార్థులను అభినందించి గణితంలో ప్రావీణ్యం ఎంతో ముఖ్యమని వివరించారు.

ట్యాంకరు లారీ బోల్తా



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 24: మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు కాటూరు బ్రిడ్జి మలుపు వద్ద అదుపు తప్పి ట్యాంకర్ లారీ బుధవారం బోల్తా పడింది. చెన్నై నుంచి శ్రీకాళహస్తి వైపు ఖాళీ ట్యాంకర్ లారీ పోతుండగా కాటూరు బ్రిడ్జి దగ్గర మలుపు దగ్గర బోల్తా పడటంతో డ్రైవర్‌కు, క్లీనర్‌కు గాయాలయ్యాయి.

కస్తూర్బా పాఠశాలలో బాలికల దినోత్సవం

కేవీబీపురం, జనవరి 24: బాలికలు ప్రభుత్వమందించే ప్రోత్సాహంతో విద్యారంగంలో ముందుకు సాగాలని ఎంఈవో రవికుమార్ సూచించారు. బుధవారం జాతీయ బాలికల దినోత్సవ సందర్భంగా కస్తూర్బా పాఠశాలలో ప్రజా ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వైద్యాధికారి వాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలత,ప్రిన్సిపాల్ సుకన్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.


జగనన్నకు చెబుదాంకు 48 వినతులు



పెట్రోల్ బాటిల్‌తో నిరసన తెలుపుతున్న మహిళ

వరదయ్యపాళెం, జనవరి 24: జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వరదయ్యపాళెం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సూళ్లూరుపేట డీఎల్‌డీవో వెంకటశేషయ్య ప్రత్యేక అధికారిగా హాజరయ్యారు. స్థానిక ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు, జడ్పీటీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.రెవెన్యూకు 23, ఆర్డీవోకు 1, హౌసింగ్‌కు 1, గ్రామీణ నీటి సరఫరాకు 3, పౌర సరఫరాలకు 1, విపత్తుల శాఖకు 1, విద్యుత్ శాఖకు 1, పంచాయతీరాజ్‌కు 6, డీఆర్‌డీఏకి 5, సర్వే సెటిల్‌మెంట్ కు 2ఫిర్యాదులు నమోదయ్యాయి. వెలుగులో సంఘమిత్రగా గతంలో పనిచేసిన సుకుమారిని ఇటీవల పక్కన పెట్టారు. రెండున్నర సంవత్సరాలు పనిచేసినా జీతం ఇవ్వలేదు. ఆమె పేరును ఆన్‌లైన్‌లో నమోదుచేయించకుండా అధికారపార్టీకి చెందిన ఓ వర్గం పనులు చేయించుకున్నారని సుకుమారి అత్త నిర్మలకుమారి డీఎల్‌డీవోకు తెలిపారు.ఆమెకు న్యాయం చేయాలని లేనిపక్షంలో చావే శరణ్యమని పెట్రోల్‌బాటిల్‌తో నిరసన తెలపడంతో అధికారులు ఆమెను అడ్డుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బ్యాడ్మింటన్ విజేత పిచ్చాటూరు జట్టు



పిచ్చాటూరు, జనవరి 24: ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా పిచ్చాటూరు జట్టు నిలిచినట్లు అధికారులు ప్రకటించారు. ఈ జట్టు జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొంటుందని వెల్లడించారు.

పాలేగార్లకు గుర్తింపు

పిచ్చాటూరు, జనవరి 24: ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ డైరెక్టర్‌గా జె.శేషాచలపతిని నియమించడంతో పాలేగార్ కులస్తులకు తగిన గుర్తింపు లభించిందని ఆ కుల సంఘం నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక గ్రంథాలయ ఆవరణంలో పాలేగార్ సంఘ నాయకుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సురుటుపల్లి పల్లికొండేశ్వర ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ ఆనంద్, నాయకులు దామోదరం, ప్రభాకర్, కృష్ణయ్య, విజయదర్, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 24:శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చువోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధశారం జాతీయ బాలికల దినోత్సవం జరిగింది. ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ గ్రూప్ అండ్ చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ (సీఆర్ఏఎఫ్) సహకారంతో బాలికలకు అవగాహన కల్పించే గోడ పత్రికలను ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు,సుబ్రహ్మణ్య శర్మ ,వినోద్ కుమార్, చిరంజీవులు, నాగరాజు,లలిత, దావూద్ తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో లింగ వివక్షపై ప్రిన్సిపాల్ శ్రీలత విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రజా ప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రగతి ట్రస్టు ప్రోగ్రాం ఆఫీసర్ సుస్మిత మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో దూసుకుపోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలను ఆదరిద్దాం

తొట్టంబేడు, జనవరి 24 : ఆడబిడ్డలను ఆదరిద్దామని ఉషోదయా ఫౌండేషన్ అధ్యక్షురాలు చక్రాలఉష అన్నారు. బసవయ్యపాళెం ప్రాథమిక పాఠశాలలో బుధవారం బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు.కేక్ కట్‌చేసి పిల్లలకు పంచి పెట్టి విద్యాసామగ్రి అందజేశారు.

నేడు తిరుమలలో పుష్యమాస పౌర్ణమి గరుడసేవ

తిరుమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పుష్యమాస పౌర్ణమి సందర్భంగా తిరుమలలో గురువారం రాత్రి గరుడసేవ నిర్వహించనున్నారు. ప్రతినెలా పౌర్ణమి రోజున టీటీడీ గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మలయప్పస్వామి తన ఇష్ట వాహనమైన గరుడునిపై కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రామకృష్ణతీర్థ ముక్కోటి

తిరుమలలో గురువారం రామకృష్ణతీర్థ ముక్కోటి నిర్వహించనున్నారు. తిరుమలకు ఆరు మైళ్ల దూరంలో ఉన్న ఈ తీర్థంలో ముక్కోటిని పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమిరోజున శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. స్కంద పురాణం ప్రకారం పూర్వకాలంలో రామకృష్ణుడు అనే మహర్షి వేంకటాద్రిపై తపస్సు చేసి, స్నానమాచరించడానికి ఈ తీర్థాన్ని రూపొందించు కున్నారు. ఇందులో స్నానమాచరించడం వల్ల అజ్ఞానంతో తల్లిదండ్రులు, గురువులను దూషించడం వల్ల కలిగే దోషాల నుంచి విముక్తి లభించి, సుఖంగా జీవిస్తారని ప్రాశస్త్యం. గురువారం ఉదయం నుంచి భక్తులను తీర్థానికి అనుమతించనున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి అనుమతి లేదని టీటీడీ స్పష్టం చేసింది. కాగా గోగర్భం డ్యామ్ పాయింట్ నుంచి పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ఆర్టీసీ దాదాపు 35 బస్సులను ఏర్పాటు చేసింది. భక్తుల సౌకర్యార్థం టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో పా లు, కాఫీ, పొంగళి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది.

హామీలు కాదు.. జీవోలు కావాలి


మీడియాతో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 24: అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించి జీవోలు విడుదల చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో పోలీసు వలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఎం తిరుపతి పర్యటన నేపథ్యంలో ఆమెను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. దీంతో పోలీసు వలయంలోనే ప్రెస్‌క్లబ్‌కు రావాల్సి వచ్చింది. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండానే మాయమాటలు చెప్పి చేతులు దులుపుకోవడం మోసం కాదా అని ప్రశ్నించారు. ఈ హామీలకు చట్టబద్ధత ఉండదని, అంగన్వాడీలను మరోసారి మోసం చేసే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సీఎం జగన్ నా అక్కచెల్లెమ్మలు అంటూ అన్ని వర్గాల మహిళలను మోసం చేశారని విమర్శించారు. మహిళలకు సున్నా వడ్డీ రూ.5 లక్షల వరకు వర్తింపజేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే రూ.3లక్షలకు కుదించడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆముదాల తులసీదాస్, బ్యాంకు శాంతమ్మ, డాక్టర్ స్వప్నప్రియ, జాహ్నవి, అనిత, యశోద తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.44 కోట్లు

తిరుమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.44 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 63,665 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,630 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి, గోవా మంత్రి మౌవిన్ గోదిన్హో, ఇండియన్ మాజీ క్రికెటర్ శ్రీకాంత్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.

మార్కెట్లోకి మహా హెచ్‌డి ప్లస్ సిమెంట్



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

తిరుపతి (కలెక్టరేట్), జనవరి 24 : మహా సిమెంట్ సంస్థ నుంచి మహా హెచ్‌డి ప్లస్ సిమెంట్‌ను బుధవారం తిరుపతిలో మార్కెట్లోకి విడుదల చేశారు. మైహోం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ రాయలసీమ మార్కెట్ కోసం తిరుపతిలో మహా హెచ్‌డీ ప్లస్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణలో సూర్యాపేట, ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, విశాఖపట్నం జిల్లాలు, తమిళనాడులోని టుటికోరిన్‌లో ఉన్న కర్మాగారాల్లో కంపెనీ మొత్తం సామర్థ్యం 12.5 ఎంటీపీఏగా ఉందన్నారు. 11 రాష్ట్రాల్లో కంపెనీ ఎనిమిది వేలకు పైగా డీలర్ నెట్‌వర్క్‌ను కలిగి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివరామ్‌ప్రసాద్, కిషన్‌రావు, గురివిరెడ్డి, విజయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు హౌసింగ్ స్కీం పనులెంతవరకొచ్చాయి?

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 24 : రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫిషియో కార్యదర్శి టి.విజయకుమార్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార కార్యాలయాన్ని తనిఖీ చేశారు. జర్నలిస్టు హౌసింగ్ కమిటీ సమావేశాలు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 583 దరఖాస్తులను రెవెన్యూ డివిజనల్ అధికారుల పరిశీలన నిమిత్తం పంపించినట్లు అధికారులు తెలిపారు. డీపీఆర్వో విజయసింహారెడ్డి, అధికారులు వెంకటరమణ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతల గృహ నిర్బంధం


హౌస్ అరెస్టులో కిరణ్‌రాయల్, రాజారెడ్డి

తిరుపతి (కొర్లగుంట), జనవరి 24 : సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో బుధవారం ఉదయం జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్, నగరాధ్యక్షుడు రాజారెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఇద్దరు చొప్పున పోలీసులు వారి ఇళ్ల వద్ద కాపుకాశారు. నేతలు మాట్లాడుతూ సీఎం తిరుపతికి వస్తుంటే పోలీసులు ఉదయం 6 గంటల నుంచే తమను బయటకు రాకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. వ్యక్తిగత పనులకు సైతం వెళ్లనీయకుండా ఆపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

త్వరలో నూతన బస్సుల రాక

జాతీయ డ్రైవర్ల దినోత్సవంలో బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి


డ్రైవర్లకు రోజా అందజేసి, అభినందిస్తున్న రాజారెడ్డి, చెంగల్‌రెడ్డి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 24 : రాష్ట్రవ్యాప్తంగా త్వరలో నూతనంగా వెయ్యి విద్యుత్, 1,500 ఇంధనం బస్సులు అందుబాటులోకి రానున్నాయని ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. తిరుపతి పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం ఆయన అలిపిరి డిపో ఆవరణలో కొబ్బరి మొక్క నాటారు. జాతీయ డ్రైవర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్‌చార్జ్ ఈడీ చెంగల్‌రెడ్డితో కలసి గ్యారేజీలో ఉన్న డ్రైవర్లకు రోజా పుష్పాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రయాణికులు మెరుగైన సేవలందించాలని, సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ఇంధన పొదుపు, సంస్థ ఆదాయం పెంపు, కార్గో వ్యవస్థ గురించి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మంగళం డిపో, సెంట్రల్ బస్టేషన్లను పరిశీలించారు.

కాలువ పోరంబోకుపై అక్రమ నిర్మాణం


కాలువ పోరంబోకు స్థలంలో జరుగుతున్న నిర్మాణం

తిరుపతి (రవాణా), జనవరి 24: మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ పంచాయతీ వెంకటేశ్వరకాలనీ వద్ద కాలువ పోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టారు. పంచాయతీ అధికారులు మంగళవారం దాన్ని తొలగించినా బుధవారం కాలువకు అనుకుని నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం ఎంతవరకు సక్రమమో రెవెన్యూ అధికారులు తేల్చాల్సి ఉంది.

30న వాహనాల వేలం

తిరుపతి (రవాణా), జనవరి 24: తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలలో ఉన్న వాహనాలను ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నామని, పాల్గొనదలచినవారు ధరావత్తు రూ.5వేలు నగదు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి రవాణాశాఖ అధికారి ఆదినారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళం డిపోలో 3 మ్యాక్సీక్యాబ్‌లు, ఒక ఐచర్, ఒక మహీంద్ర, టాటా గూడ్స్ వాహనాలు, శ్రీకాళహస్తి డిపోలో 2 మహీంద్ర ఆటోలు, 1 బజాజ్ ఆటో, 1 మహీంద్ర మ్యాక్సీ క్యాబ్, 1 మోటారు క్యాబ్ ఉన్నాయని తెలిపారు.

నేడు గంగమ్మ ఆలయంలో చండీహోమం

తిరుపతి (కల్చరల్), జనవరి 24 : తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయంలో గురువారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు చండీహోమం నిర్వహించనున్నారు. ఆసక్తి గల భక్తులు రూ.501 చెల్లించి, పాల్గొనవచ్చునని ఆలయ కార్యనిర్వహణ అధికారి మమత ఒక ప్రకటనలో తెలిపారు.

ఆయుర్వేదానికి పెరుగుతున్న మద్దతు



మాట్లాడుతున్న మురళీకృష్ణ

తిరుపతి (కల్చరల్), జనవరి 24: ప్రపంచాన్ని వణికించిన కొవిడ్ మహమ్మారి నివారణకు ఆయుర్వేదం బాగా ఉపకరించిందని, ఈ కారణంగా ఈ వైద్యాన్ని ఆశ్రయించే వారి సంఖ్య పెరిగిందని టీటీడీ ఆయుర్వేద కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, భారతీయ విద్యాభవన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 16వ పుస్తక ప్రదర్శనలో బుధవారం సాయంత్రం ధన్వంతరి వేదిక నుంచి ఆయన మాట్లాడుతూ వేద విజ్ఞానం మనకు ప్రసాదించిన గొప్ప విజ్ఞానం ఆయుర్వేదమని తెలిపారు. ఈ విధానంలో చెప్పిన ప్రకారం జీవన శైలి అలవాటు చేసుకున్న వారికి ఆరోగ్య సమస్యలు చాలావరకు దూరమౌతాయన్నారు. గౌరవ అతిథి, టీటీడీ ఆయుర్వేద కళాశాల, కాయచికిత్స విభాగ అధిపతి డాక్టర్ ఎస్.జ్ఞానప్రసూన మాట్లాడుతూ ఆధునిక వైద్య శాస్త్రం కూడా ధన్వంతరి విధానాన్ని ఆదరిస్తోందన్నారు. ఆయుర్వేదం చికిత్సలో జబ్బులను నయం చేయడం మాత్రమే కాకుండా అవి రాకుండా నివారించే విధానం కూడా ప్రధానమైందని తెలిపారు. మరో అతిథి, మాజీ ఐజీ జె.ప్రభాకరరావు మాట్లాడుతూ పుస్తకం చదువుకున్నంత సుఖంగా డిజిటల్ విధానంలో చదువుకోలేమన్నారు. ఈ సభకు భారతీయ విద్యా భవన్ సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ రాజు అధ్యక్షత వహించారు. పంచసహస్రావధాని మేడసాని మోహన్, ఎస్వీయూ పూర్వ వీసీ ఆచార్య మురళి, ఆచార్య దక్షిణామూర్తి శర్మ, యుగంధరరాజు, జుగ్గారావు, తోట వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సాహితీప్రియులు పాల్గొన్నారు. సాయంత్రం భారతీయ విద్యాభవన్, శ్రీవేంకటేశ్వర విద్యాలయ విద్యార్థుల సంగీత విభావరి ఆహూతులను అలరించింది.

నేటి కార్యక్రమాలు

తిరుపతి పుస్తక ప్రదర్శనలో ఆరవరోజైన గురువారం మధ్యాహ్నం కాలేజీ విద్యార్థులకు నాకు నచ్చిన పుస్తకం అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారు. సంగీత విభావరి ఉంటుంది. సాయంత్రం 6.30 గంటలకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వేదికపై ఎస్వీబీసీ ఛానల్ అధ్యక్షుడు డాక్టర్ వెలుగోటి సాయికృష్ణయాచేంద్ర గేయావధానం ఉంటుంది. శ్వేత పూర్వ సంచాలకులు భూమన్ అధ్యక్షత వహిస్తారు.

చందమామ కథల పుస్తకాలు బాగున్నాయి



నా పేరు అనన్య, భారతీయ విద్యాభవన్‌లో 9వ తరగతి చదువుతున్నాను. తిరుపతి పుస్తక ప్రదర్శనలో చిన్నపిల్లల కథల నుంచి ఆధ్యాత్మిక గ్రంథాల వరకూ చాలా పుస్తకాలు ఉన్నాయి. కొత్తగా వచ్చిన చందమామ కథల పుస్తకాలు ఎంతో బాగున్నాయి. నేను వ్యాకరణం, మరి కొన్ని ఆధ్యాత్మిక పుస్తకాలు కొనుక్కున్నాను. సంగీత కార్యక్రమాలు, ప్రసంగాలు కొత్త విషయాలు తెలుసుకునేలా ఉన్నాయి.

శతకపద్యాల పుస్తకం కొన్నాను



నాపేరు చందన, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్‌లో 8వ తరగతి చదువుతున్నాను. ఈ పుస్తక ప్రదర్శన ఎంతో బాగుంది. ఇన్ని పుస్తకాలు చూడడం ఇదే మొదటిసారి. నాకు ఇష్టమైన శతక పద్యాల పుస్తకాలు కొన్నాను. ఇటువంటి ప్రదర్శన వల్ల విద్యార్థుల్లో చదువుకోవాలనే ఆశ పెరుగుతుంది.

మంచి విషయాలు తెలుస్తాయి



నా పేరు చరణ్ రెడ్డి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మంగళం ట్రెండ్స్‌లో 9వ తరగతి చదువుతున్నాను. ఈ పుస్తక ప్రదర్శనలో చాలా పుస్తకాలు ఉన్నాయి. అన్నీ కొనేయాలనిపిస్తోంది. పుస్తకాలు చదివితే బుద్ధి వికసిస్తుందని మా సార్ చెప్పారు. ఈ ప్రదర్శనకు రావడం సంతోషంగా ఉంది.

బోలెడు పుస్తకాలున్నాయి



నాపేరు రాధిక. మంగళం ట్రెండ్స్‌లో 8వ తరగతి చదువుతున్నాను. పుస్తకాలు మానవ జీవితాలను ఎంతో ప్రభావితం చేస్తాయని మా సార్లు చెబుతుంటారు. అలాగే మంచి పుస్తకాలు చదవాలని, పుస్తకాలు చదవడం వలన మంచి వ్యక్తిత్వం అలవడుతుందని చెప్పారు. నేను నీతి కథలు చదవడానికి ఇష్టపడతాను. అవి ఇక్కడ చాలా ఉన్నాయి.

మంత్రి రోజాను బర్తరఫ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహాయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 24 : రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ పుత్తూరు 17వ వార్డు కౌన్సిలరు భువనేశ్వరికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి ఇస్తానని డబ్బు తీసుకుని మోసం చేయడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి ఈ విషయంపై స్పందించి దళిత మహిళను మోసం చేసిన మంత్రిని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నగరి నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా విషయంలో బహిరంగంగా ఓ పోలీసును దూషించినా చర్యలు లేవన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను వాడుకుని వదిలేస్తున్నారే తప్పా వారికి న్యాయం చేయడం లేదన్నారు. సదరు కౌన్సిలర్‌కు న్యాయం చేయకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాయం వెంకటరత్నం మాట్లాడుతూ ఎమ్మెల్యే రోజా ఇప్పటికే వడమాలపేట, పాదిరేడు, ఆర్నియల్ ప్రాంతాల రైతులను నష్టపరిహారం పేరుతో మోసం చేశారని ఆరోపించారు. టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన ఇంటి స్థలాల్లోనూ సొంత లాభం చూసుకున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు విజయ్, పెంచలయ్య, నాగరాజు, సుబ్బయ్య, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రామ చిలక.. గోరువంక..!

ఎస్వీయూలో ఆకట్టుకున్న పక్షుల చిత్రాల ప్రదర్శన


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న వీసీ శ్రీకాంత్ రెడ్డి - తిలకిస్తున్న సందర్శకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 24: పాలపిట్ట.. తీతువమ్మ.. పావురాయి.. తెల్ల కొంగ.. నరుడు పెట్టిన పేర్లు తప్ప తమకు ఊరూ పేరూ లేదు.. పేరు కోసం వీసమంత ఆరాటం లేదు.. అన్నట్టుగా ఎస్వీయూ జువాలజీ విభాగంలో బుధవారం నిర్వహించిన పక్షుల చిత్రాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులతో పాటు నగరవాసులు సందర్శించారు. పక్షుల చిత్రాలను చూసి వారు అబ్బురపడ్డారు. ఈ ప్రదర్శనను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. నిర్వాహకులను వీసీ శ్రీకాంత్ రెడ్డి అభినందించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారి కిరణ్‌కుమార్ తీసిన సుమారు 200 పక్షుల ఫొటోలను ఈ సందర్భంగా ప్రదర్శనకు ఉంచారు.

వైసీపీ సర్పంచ్, కార్యకర్త బాహాబాహి

- ఒకరికి గాయాలు


గాయపడిన జానకిరామ్‌ను విచారిస్తున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 24: ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ నేతలు ప్రతి గ్రామంలో కార్యకర్తలను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం చెవిరెడ్డి సమీప బంధువు దామోదరరెడ్డి, మరో ఇద్దరు స్థానిక సర్పంచ్ ధనమునిరెడ్డిని కలిసి పాడిపేట పంచాయతీ శివపురంలోని వైసీపీ కార్యకర్త జానకిరాం ఇంటికి వెళ్లారు. స్థానికంగా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. తాము నివాసం ఉండేటివి డీకేటీ స్థలాలు అని, వాటి ఇంటి పన్నులు ఇంత వరకు వేసి ఇవ్వలేదని, తనకు ఎక్కడ న్యాయం జరిగిందని ప్రశ్నించాడు. దీంతో సర్పంచ్ ధనమునిరెడ్డి కలగజేసుకోవడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో జానకిరాంపై సర్పంచ్ చెయ్యి చేసుకున్నాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న జానకిరామ్ సర్పంచ్‌పై చేయి చేసుకున్నాడు. ఇది చూసిన చెవిరెడ్డి మనుషులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సర్పంచ్‌పై చేయి చేసుకున్న విషయం అతని అనుచరులకు తెలియడంతో వారు పెద్దసంఖ్యలో వచ్చి జానకిరామ్‌ను చితకబాదేశారు. అడ్డు వచ్చిన మరొకరిపై చెయి చేసుకున్నారు. ఇంటి కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు శివపురం గ్రామానికి చేరుకుని సర్దిచెప్పారు. గాయపడిన జానకిరామ్ చికిత్స నిమిత్తం రుయాలో చేరాడు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పారిశుధ్య ఏజన్సీ కాంట్రాక్టు రద్దు చేయాలి

- రుయాస్పత్రి ఎదుట ఏఐటీయూసీ నేతల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

తిరుపతి సిటీ, జనవరి 24 : పారిశుధ్య కార్మికుల శ్రమను దోచుకుంటున్న ఏ-1 ఏజన్సీ కాంట్రాక్టును తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు రుయాస్పత్రి కార్యాలయ భవనం ఎదుట బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ 549 జీవో ప్రకారం 215 మంది కార్మికులతో చేయించాల్సిన పనులను ఏజన్సీ నిర్వాహకులు కేవలం 90 మందితోనే చేయిస్తున్నారన్నారు. రూ.16 వేల జీతానికి బదులు రూ.10వేలు మాత్రమే ఇస్తూ శ్రమను దోచుకుంటున్నారని తెలిపారు. ఇదేమని ప్రశ్నించిన కార్మికులను విధుల నుంచి తొలగించడంతో పాటు ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై పలుమార్లు రుయా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ధర్నాకు దిగాల్సి వచ్చిందన్నారు. ఏజన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకునే వరకు ఆ పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ రవిప్రభు అక్కడకు చేరుకుని ఏజన్సీ నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదనే విషయం ఇప్పటికే తమ దృష్టికి వచ్చిందని, దీనిపై మరింత లోతుగా విచారించి పది రోజుల్లో తప్పక న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, మహేంద్ర, ఏఐటీయూసీ నేతలు కిషోర్, మునివేలు, సునీల్, కవిత పాల్గొన్నారు.

దళితులపై వివక్ష బాధాకరం

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 24 : చంద్రగిరి తహసీల్దారు శిరీష దళితులు, బలహీన వర్గాలపై వివక్ష చూపుతున్నారని, ఆమెపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి సత్తార్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సమస్యలు చెప్పుకోవడానికి వెళ్లిన దళితులకు న్యాయం చేయకపోగా వారిని అవమానించేలా తహసీల్దార్ వ్యవహరిస్తుండడం బాధాకరమన్నారు. నియోజకవర్గంలో దళితులకు సంబంధించిన భూములను పెత్తందారులు ఆక్రమించుకున్న విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా అవహేళనగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. మామండూరు అరుంధతివాడకు చెందిన కొమ్ము గంగులమ్మ 75 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 85 సెంట్ల భూమిని తహసీల్దారు స్వాధీనం చేసుకుని, నష్టపరిహారం చెల్లించమని బాధితురాలు కోరుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. దీనిపై విచారించి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ ఇన్‌చార్జి లోకేష్‌రెడ్డి, లిబరేషన్ కమిటీ సభ్యులు బాలకృష్ణ, ఏఐటీయూసీ బాబునాయక్, బాధితులు సుజాత, లక్ష్మి, కృష్ణనాయుడు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

18 ఏళ్లు నిండిన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించండి

తిరుపతి(విద్య) జనవరి 24: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాలోని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 18 ఏళ్లు నిండిన విద్యార్థులతో ఓటర్స్ ప్లెడ్జ్(ప్రతిజ్ఞ) నిర్వహించాలని స్వీప్ నోడల్ అధికారి, ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. భారత పౌరులైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో.. మనదేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామన్న ప్రతిజ్ఞని చేయించాలని కోరారు.

గణతంత్ర వేడుకలకు గోకులం ముస్తాబు

తిరుమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల గోకులం విశ్రాంతి భవనం ఈనెల 26వ తేదీ గణతంత్ర వేడుకలకు ముస్తాబైంది. అదనపు ఈవో క్యాంపు కార్యాలయమైన ఈ భవనం ప్రాంగణంలో గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవాలను టీటీడీ నిర్వహిస్తోంది. శుక్రవారం ఉదయం 7 గంటలకు జాతీయ జెండాను ఎగురవేస్తారు. ముఖ్య అతిథిగా ఈవో ధర్మారెడ్డి పాల్గొని, తన సందేశాన్ని ఇస్తారు.

జర్నలిస్టులను చెవిరెడ్డి క్షమాపణ కోరాలి


కరపత్రాలు చూపుతున్న జనసేన నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 24: చంద్రగిరి నియోజకవర్గ జర్నలిస్టులను బెదిరించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని జనసేన చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 'నేను నక్సలైట్‌గా పనిచేశాను.. మీకోసం కొంతమంది మనుషులను తయారు చేసి ఉంచాను.. వారు మీ పనిపడతారు' అని ఎమ్మెల్యే సంబోధించడం బాధ్యతా రాహిత్యమన్నారు. అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందాలే తప్పా విలువల్లేని రాజకీయాలు చేయడం బాధాకరమన్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ అభిమాని తన ఇంటికి పోస్టరు అంటిస్తే పంచాయతీ అధికారులను పంపి చింపివేయడం ఎమ్మెల్యే అవివేకానికి నిదర్శనమన్నారు. జర్నలిస్టులను బెదిరించిన విషయాన్ని ఎస్పీ సుమోటోగా తీసుకుని ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని, చంద్రగిరి క్లాక్‌టవర్ దగ్గర ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కృష్ణరాయల్, సంజీవి, హరి, మురళి, దిలీప్, యువరాజ్, నవీన్, సురేష్, మురళి, గోపి పాల్గొన్నారు.

నేడు తిరుమలలో పుష్యమాస పౌర్ణమి గరుడసేవ

తిరుమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పుష్యమాస పౌర్ణమి సందర్భంగా తిరుమలలో గురువారం రాత్రి గరుడసేవ నిర్వహించనున్నారు. ప్రతినెలా పౌర్ణమి రోజున టీటీడీ గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రామకృష్ణతీర్థ ముక్కోటి : తిరుమలలో గురువారం రామకృష్ణతీర్థ ముక్కోటి నిర్వహించనున్నారు. తిరుమలకు ఆరు మైళ్ల దూరంలో ఉన్న ఈ తీర్థంలో ముక్కోటిని పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమిరోజున శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. స్కంద పురాణం ప్రకారం పూర్వకాలంలో రామకృష్ణుడు అనే మహర్షి వేంకటాద్రిపై తపస్సు చేసి, స్నానమాచరించడానికి ఈ తీర్థాన్ని రూపొందించు కున్నారు. ఇందులో స్నానమాచరించడం వల్ల అజ్ఞానంతో తల్లిదండ్రులు, గురువులను దూషించడం వల్ల కలిగే దోషాల నుంచి విముక్తి లభించి, సుఖంగా జీవిస్తారని ప్రాశస్త్యం. గురువారం ఉదయం నుంచి భక్తులను తీర్థానికి అనుమతించనున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి అనుమతి లేదని టీటీడీ స్పష్టం చేసింది. కాగా గోగర్భం డ్యామ్ పాయింట్ నుంచి పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ఆర్టీసీ దాదాపు 35 బస్సులను ఏర్పాటు చేసింది. భక్తుల సౌకర్యార్థం టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో పాలు, కాఫీ, పొంగళి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది.

29న కాంగ్రెస్ సభను జయప్రదం చేయండి


ప్రజలతో మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి (తిలక్‌రోడ్), జనవరి 24 : తిరుపతిలో ఈనెల 28న నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ సభను జయప్రదం చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ కోరారు. మార్పు కావాలి-కాంగ్రెస్ రావాలి కార్యక్రమంలో భాగంగా బుధవారం తిరుపతి నగరంలో పలు వార్డుల్లో ఆయన ప్రజలతో మమేకమై కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడానికి గల ఆవశ్యకతను వివరించారు. 29న జరిగే సభకు పీసీసీ నూతన అధ్యక్షురాలు షర్మిళ హాజరవుతారని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 130 అసెంబ్లీ, 20 లోక్‌సభ స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు గోపిగౌడ్, శాంతియాదవ్, రవి, ప్రభాకర్, మునిశోభ, వెంకటేష్ గౌడ్, జావేద్ పాల్గొన్నారు.

రేపు విశ్వంలో సైనిక్ నమూనా పరీక్ష

తిరుపతి(విద్య) జనవరి 24 : వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు సైనిక్ ఉచిత నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్కూల్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో సైనిక్ విద్యాలయాల్లో 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 28న నిర్వహించే ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు సబ్జెక్టుల పరంగా లోపాలను సరిదిద్దుకునేందుకు మరింత ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. హాజరయ్యేవారు ఎటువంటి ప్రవేశ రుసుమూ చెల్లించాల్సిన అవసరంలేదని, హాల్ టికెట్(అడ్మిట్‌కార్డు)జెరాక్స్ కాపీని వెంటతెచ్చుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8688888802/03, 9399976999లను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ భవిష్యత్తు డ్రైవర్లపైనే ఆధారపడి ఉంటుంది

తిరుమల ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్


డ్రైవర్లకు పుష్పాలు అందిస్తున్న విశ్వనాథ్

తిరుమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ భవిష్యత్తు డ్రైవర్ బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పైనే ఆధారపడి ఉంటుందని తిరుమల ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం డ్రైవర్స్ డే కార్యక్రమాన్ని తిరుమల ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించారు. విశ్వనాథ్ మాట్లాడుతూ డ్రైవర్ నడవడిక, నైపుణ్యతే సంస్థ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. డ్రైవర్లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డ్రైవర్ల సేవలను కొనియాడుతూ పుష్పాలను అందించారు. అసిస్టెంట్ మేనేజర్ వెంకటరమణ, అసిస్టెంట్ ఇంజినీరింగ్ శేఖర్, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు.

నేడు టీడీపీ తిరుపతి రూరల్ సమావేశం

తిరుపతి రూరల్, జనవరి 24:తిరుపతిరూరల్ టీడీపీ సర్వసభ్య సమావేశం గురువారం జరగనుంది. సాయంత్రం 4 గంటలకు రఘునాథ రిసార్ట్‌లో ప్రారంభం కానుంది. ఇందులో పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని పాల్గొంటారు.టీడీపీనాయకులు, క్లస్టర్,యూనిట్,బూత్ ఇన్‌చార్జులు, రాష్ట్ర, పార్లమెంటు, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఈ మేరకు తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటమే!

» రాష్ట్ర ప్రభుత్వానికి రేషన్ డీలర్ల సమాఖ్య హెచ్చరిక

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే పోరాటానికి సిద్ధమవుతామని రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు హెచ్చరించారు. రాష్ట్రంలో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందించుకునేందుకు బుధవారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర రేషన్ డీలర్ల సమావేశాన్ని నిర్వహించారు. డీలర్ల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన పార్టీలకే డీలర్లు మద్దతు ఉంటుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రేషన్ డీలర్లకు పలు సౌకర్యాలు కల్పిస్తూ ఉత్తర్వులు(జీవో నెం.5) జారీ చేసినప్పటికీ.. ప్రస్తుత ప్రభుత్వం ఆ జీవోను అమలు చేయకుండా తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఆ జీవో ప్రకారం.. డీలర్లకు సంక్షేమ నిధి ఏర్పాటు, హెల్త్‌కార్డులు, బీమా సౌకర్యం, ఈఎస్ఐ వైద్య సౌకర్యం కల్పించాలని, మరణించిన డీలర్లకు మట్టి ఖర్చులు మంజూరు చేయాలని కోరారు. సమావేశానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.వరప్రసాద్ హాజరయ్యారు. ఆయనను డీలర్ల సమాఖ్య ముఖ్య సలహాదారుగా నియమించుకున్నట్లు లీలా మాధవరావు తెలిపారు. డీలర్ల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'పరిటాల'కు ఘన నివాళి

» వెంకటాపురానికి వేలాదిగా వచ్చిన అభిమానులు



వెంకటాపురంలోని పరిటాల ఘాట్ వద్ద కుటుంబ సభ్యుల నివాళులు

రామగిరి, జనవరి 24: మాజీ మంత్రి, దివంగత టీడీపీ నేత పరిటాల రవీంద్రకు వేలాది మంది అభిమానులు ఘన నివాళులు అర్పించారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలోని ఆయన స్వగ్రామం వెంకటాపురంలో బుధవారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి జనం పోటెత్తారు. తెలంగాణ, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల నుంచి అభిమానులు విశేషంగా తరలివచ్చారు. పరిటాల రవీంద్ర సతీమణి, మాజీ మంత్రి పరిటాల సునీత, కుమారుడు, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఉదయమే ఘాట్ వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు. టీడీపీ రెండు జిల్లాల అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న తదితరులు పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. కాగా, టీడీపీ జాతీయ కార్యాలయంలో బుధవారం స్వర్గీయ పరిటాల రవీంద్ర 19వ వర్ధంతి సందర్భంగా పలువురు నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆసరా పేరుతో అబద్ధాలు: కూన రవికుమార్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆసరా పేరుతో అబద్ధాలు చెప్పేవాడిని, డబ్బుపిచ్చితో కల్తీ మద్యం అమ్ముతూ తాళిబొట్లు తెంపేవాడిని, సొంత తల్లి, చెల్లిని మెడపట్టి గెంటిన వాడిని రాష్ట్రంలోని అక్క చెల్లెమ్మలు నమ్ముతారా? అని మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళగిరిలో ప్రశ్నించారు. చంద్రబాబు ఒక్కొక్కరికీ రూ.20 వేలు చొప్పున కోటి మందికి అందిస్తే... జగన్ ఇప్పటి వరకు రూ.15 వేలు మాత్రమే ఇచ్చారన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిరసిస్తూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామా చేసి మూడేళ్లు అవుతుంటే, స్పీకర్ ఇన్నేళ్లు నిద్రపోయి ఇప్పుడు జగన్ ఆదేశాలతోనే ఆ రాజీనామాను ఆమోదించారని, వచ్చే ఎన్నికల్లో ఆముదాలవలస ప్రజలు స్పీకర్ చీటీ చింపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

టీడీపీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు: చిరంజీవిరావు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'టీడీపీకి పార్టీలోను, పక్క రాష్ట్రాల్లోను స్టార్ క్యాంపెయిన్లు ఉన్నారని ఉరవకొండ సభలో సీఎం జగన్ సన్నాయి నొక్కులు నొక్కాడు. వారు టీడీపీకి అండగా నిలవడానికి కారణమేమిటో ఆయన ఆలోచించుకోవాలి' అని ఆ పార్టీ ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిరంజీవిరావు అన్నారు. బూతులు మాట్లాడే ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నవి లేనట్లురాసే, చూపే జగన్ మీడియా వైసీపీ ప్రధాన స్టార్ క్యాంపెయినర్లు కాదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ భవనాలు, చివరకు చిన్నారుల కిట్లపై కూడా తన బొమ్మలు ముద్రించుకోవడం జగన్ క్యాంపెయినింగ్ పిచ్చికి నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు.

సొసైటీల వెయ్యి కోట్లు సీఎం ఖజానాకు: గోరంట్ల

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'జగన్‌రెడ్డి ధనదాహానికి రాష్ట్ర సహకార రంగం బలైపోయింది. తన పార్టీ వారు, నచ్చిన వారిని సహకార సంఘాల్లో నామినేట్ చేయడం ద్వారా సీఎం జగన్ రూ.1,000 కోట్ల సొసైటీ సొమ్ము కాజేశాడు' అని టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. నిధులు పక్కదారి పట్టించి స్థానిక సంస్థలు సహా అన్నీ వ్యవస్థల్ని చిన్నాభిన్నం చేసినట్లే సీఎం సహకార రంగాన్నీ నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సహకార రంగంలోని అవకతవకలపై సమగ్ర విచారణ జరగాలన్నారు. ఇక, రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని పోటీకి పెట్టాలని వైసీపీ ఎమ్మెల్యేలే కోరుతున్నారని బుచ్చయ్య చౌదరి తెలిపారు. 'టీడీపీ అభ్యర్థిని నిలబెడితే ఓటేసి గెలిపిస్తామని 50 మంది ఎమ్మెల్యేలు మాతో సంప్రదిస్తున్నారు. గంటా శ్రీనివాసరావు రాజీనామాపై మూడేళ్ల పాటు స్పీకర్, సీఎంలు గాడిదలు కాస్తున్నారా? సీఎం జగన్ భయపడుతున్నారు. అందుకే గంటా రాజీనామాను ఇప్పుడు ఆమోదించారు' అని బుచ్చయ్య పేర్కొన్నారు.

ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి హైకోర్టు నోటీసులు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా పీవీజీడీ ప్రసాదరెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఆయనకు వ్యక్తిగత హోదాలో నోటీసులు జారీ చేసింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తదితరులకు నోటీసులు జారీచేసి, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ప్రసాదరెడ్డి ఏయూ వీసీగా పనిచేసిన సమయంలో పాల్పడిన అవకతవకలపై విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, అండ్ మైనార్టీ అల్యూమిని అసోసియేషన్ వెల్ఫేర్ సొసైటీ జాయింట్ సెక్రెటరీ యూవీ రమణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

మార్కెట్ కమిటీ ఉద్యోగులకు పదోన్నతులు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 218 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పని చేస్తున్న ఉద్యోగులకు మార్కెటింగ్ శాఖ పదోన్నతులు కల్పించింది. 112 మందికి గ్రేడ్ 1, 2, 3 ప్రత్యేక శ్రేణి కార్యదర్శులుగా పదోన్నతులు లభించాయి. సూపర్‌వైజర్లకు అసిస్టెంట్ సెక్రటరీలుగా అవకాశం దక్కింది. పదోన్నతులు పొందిన ఉద్యోగులకు గత వారం నుంచి కౌన్సెలింగ్ ద్వారా మూడు ప్లేస్‌మెంట్ల ఆప్షన్‌తో ఎంచుకున్నచోట పోస్టింగ్‌లు ఇచ్చారు.

నేటి నుంచి రేడియాలజీ జాతీయ సదస్సు

విజయవాడ (లబ్బీపేట), జనవరి 24: ఇండియన్ రేడియాలజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ 76వ జాతీయ సదస్సును మంగళగిరిలోని సికె కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు సదస్సు ఛైర్మన్ డాక్టర్ జి.వి.మోహన్ ప్రసాద్ తెలిపారు. ఇమేజింగ్ బియాండ్ ఇమాజినేషన్ అనే ఇతివృత్తంతో జరిగే ఈ సదస్సులో 3500 మంది ప్రముఖులు, 330 మంది ఫ్యాకల్టీ వస్తున్నారని, విదేశాల నుంచి మరో 100 మంది హాజరవుతున్నారని తెలిపారు.

ఠాకూర్‌కు భారతరత్న సంతోషకరం: బాబు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన బీహార్ మాజీ సీఎం దివంగత కర్పూరీ ఠాకూర్‌కి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న లభించినందుకు సంతోషంగా ఉందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన 'అట్టడుగు, అణగారిన వర్గాలను ఉద్ధరించడానికి జన నాయక్ కర్పూరీ ఠాకూర్ చేసిన కృషి అసమాన్యమైనది. చెరగని ముద్ర వేసిన ఆయన సేవలకు నేడు సమున్నత గౌరవం దక్కింది' అని పేర్కొన్నారు.

బాబు, లోకేశ్ నాయకత్వంలో టీడీపీ బలోపేతం

» శ్రేణులకు టీడీపీ ఎమ్మెల్సీల పిలుపు.. కర్నూలు జిల్లాలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ

కర్నూలు(అర్బన్), జనవరి 24: చంద్రబాబు, లోకేశ్ నాయకత్వంలో పార్టీని బలోపేతం చేద్దామని ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, కంచర్ల శ్రీకాంత్ సంయుక్తంగా పిలుపునిచ్చారు. బుధవారం కర్నూలులో కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం, హిందూపురం, పరిధిలోని 36 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నాయకులకు ఒక రోజు ఇంటిగ్రేటెడ్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ... 'ప్రజలకు, పార్టీ నాయకులు చేరువయ్యేలా శిక్షణ ఇస్తున్నాం. ఇందులో సాంకేతిక అంశాలను రాజకీయాలకు జోడిస్తున్నాం. పార్టీ కేడర్‌ను ప్రజలకు దగ్గర చేసేందుకు జాతీయ ప్రధాన కార్యాదర్శి లోకేశ్ గ్రామ, బూత్ స్థాయిల్లో ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి సీఎం కావాలన్న దురాశతో సీఎం జగన్ రెడ్డి ఓట్ల దొంగగా మారిపోయాడు' అని ఆరోపించారు.



'సత్ప్రవర్తనతో ఉన్న ఖైదీలకు క్షమాభిక్షను దూరం చేయడం ఏ మాత్రం సబబు కాదు. మంచి ప్రవర్తనతో ఉన్నవారికి మరో సారి బాగా జీవించే అవకాశం కల్పించడం సరైన నిర్ణయమే' - సుప్రీంకోర్టు

'మీరు మంచిగా మారండి. బయటకు వెళ్లిన తర్వాత మీ కుటుంబాలతో గౌరవంగా, సంతోషంగా బతకాలి. మళ్లీ నేరాలు చేయకూడదు. క్షమాభిక్ష జీవోల కోసం ఒత్తిడి పడొద్దు. నేనున్నాను. వాటి సంగతి నేను చూసుకుంటాను'

- రాజమహేంద్రవరం జైలులో ఆసుపత్రి శంకుస్థాపనకు వచ్చినప్పుడు ఖైదీలతో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు

ఖైదీలకు మళ్లీ కన్నీరేనా!

» విడుదల కోసం జైలు పక్షుల ఎదురు చూపులు

» గణతంత్ర దినోత్సవానికి క్షమాభిక్షపై అయోమయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'క్షమ' లేని పాలకుల దయా'భిక్ష' దొరక్క, సత్ప్రవర్తన కలిగిన ఎందరో ఖైదీలు జైళ్లలోనే మగ్గిపోతున్నారు. క్షమాభిక్ష జీవో కోసం చివరి క్షణం వరకూ ఎదురుచూడటం.. ప్రభుత్వం కనికరం చూపకపోవడంతో నిరాశ నిండిన గుండెలతో కన్నీటిని దిగమింగుకొంటూ.. ఆహారం సయించక.. కంటిపై కునుకు రాక.. ఇటు ఖైదీలు.. అటు వారి కుటుంబాలు తీవ్ర మానసిక ఒత్తిడిలో మునిగిపోతున్నాయి. అయినా ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదు. గత ప్రభుత్వంలో సమయానికి క్షమాభిక్ష జీవోలు జారీ అయ్యేవి. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక గత నాలుగున్నరేళ్లలో ఒక్కసారి మాత్రమే జీవో ఇచ్చారు. జైలు అధికారులు ఎంత వేగంగా ప్రక్రియ పూర్తిచేసి జాబితాను పంపుతున్నా నెలల తరబడి తాత్సారం జరుగుతోంది. పాలకుల నిర్దయతో గతేడాది ఆగస్టు 15న విడుదల కావాల్సిన జీవిత ఖైదీల జాబితా ఇంకా సర్కారు వద్దే నానుతోంది. దీంతో ఈ గణతంత్ర దినోత్సవానికి వెలువడే నిర్ణయం జైళ్లలోని జీవిత ఖైదీలు ఎదురు చూస్తున్నారు.

రాజమహేంద్రవరం జైలులో...

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న వారిలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 2023 మార్చి 16న జీవో 58 ఇచ్చింది. దీని ప్రకారం ఏడాదికి మూడు విడతల్లో ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం వడపోత అనంతరం 34మంది క్షమాభిక్షకు అర్హులని జైలు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వీరంతా గత ఆగస్టులోనే విడుదల కావాల్సి ఉంది. హైపవర్ కమిటీ సమావేశం పూర్తయి సుమారు 3 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటికీ ఆ జాబితాను కేబినెట్‌లో పెట్టలేదు.

ప్రభుత్వం తీరుతో అన్యాయం

గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు క్షమాభిక్ష జీవోలు జారీ అయ్యేవి. రెండేళ్లకోసారైనా పెద్దసంఖ్యలో ఖైదీలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేవారు. కానీ జగన్ ప్రభుత్వంలో వారికి ఎదురుచూపులే మిగిలాయి. గడిచిన నాలుగున్నరేళ్లలో ఒక్కసారి మాత్రమే క్షమాభిక్షపై ఖైదీలను విడుదల చేశారు. అప్పట్లో సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక జైలులో కలిపి సుమారు 60 మందికి పైగా బయటకు వెళ్లారు. అక్కడా వారికి అన్యాయమే జరిగింది. 2021లో విడుదలకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ ఖైదీలను వెంటనే విడుదల చేయలేదు. ఏడాది ఆలస్యంగా 2022 ఆగస్టు 15న బయటకు వదిలారు. మరో అన్యాయం ఏమిటంటే.. 2022లో వదిలిన ఖైదీలకు 2021ని కటాఫ్‌గా తీసుకున్నారు. అలాకాకుండా 2022నే కటాఫ్‌గా తీసుకుంటే మరికొంత మంది తమ కుటుంబాల చెంతకు చేరే అవకాశం లభించేది. ప్రభుత్వం తీరుతో ఆ ఖైదీలు ఏడాది శిక్ష అదనంగా అనుభవించారు.

ఖైదీ కుటుంబంపై ప్రతికూల ప్రభావం

సాధారణ జీవిత ఖైదీలకు 7ఏళ్ల శిక్ష, మూడేళ్ల రెమిషన్‌తో కలుపుకొని పదేళ్లు, 498(ఏ), డెకాయిటీ, దొంగతనాలు వంటి తీవ్రమైన నేరాల్లో 14+6, మహిళలకు 3+2, 65ఏళ్లు దాటినవారికి ఐదేళ్ల శిక్ష, రెండేళ్ల రెమిషన్‌తో ఏడేళ్లు పూర్తిచేస్తే, కొన్ని నిబంధనలకు లోబడి క్షమాభిక్షకు అర్హులవుతారు. ప్రస్తుతం 15ఏళ్లకు పైబడి శిక్ష అనుభవిస్తున్నవాళ్లు, రెమిషన్‌తో కలిపి 20ఏళ్లు దాటిపోయిన ఖైదీలు, 65ఏళ్లు నిండిన వృద్ధులు ఉన్నారు. క్షమాభిక్ష జీవో జారీలో తీవ్ర నిర్లక్ష్యంతో వారి కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. కొన్ని కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు అంతకుముందు ఎలాంటి నేర చరిత్ర ఉండదు. క్షణికావేశంలోనో, స్నేహితులతో వెళ్లి లేదా ఏదో గొడవ పెద్దదై నేరం జరిగి ఉంటుంది. అలాంటి కేసుల్లోని వారు కూడా ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. కొన్ని కేసుల్లో భార్య భర్త ఇద్దరికీ శిక్ష పడటంతో వారి పిల్లలు అనాథలవుతున్నారు. దేశంలో సంచలనం రేకెత్తించిన కేసుల్లో సైతం క్షమాభిక్ష ప్రసాదిస్తున్నారని.. క్షణికావేశంలో నేరానికి పాల్పడినవారిపై మాత్రం దయ చూపట్లేదని ఖైదీల కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. ఖైదీ సత్ప్రవర్తనను దృష్టిలో ఉంచుకొని క్షమాభిక్ష ప్రసాదించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కోడికత్తి శ్రీను జైల్లో... వివేకా హంతకులు బయట!

» ఐదేళ్లుగా శ్రీనుకు బెయిల్ రాకుండా జగన్ కుట్రలు

» రౌండ్ టేబుల్‌లో వివిధ పార్టీల నేతలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నేతలు

విజయవాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కోడికత్తి కేసులో నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావుకు బెయిల్ వచ్చే పోరాటం చేయాలని, ఆ కుటుంబానికి అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు అండగా నిలవాలని పలువురు వక్తలు స్పష్టం చేశారు. ఈ కేసులో సీఎం జగన్ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విజయవాడలోని దాసరి భవన్‌లో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయపక్షాల నేతలు, దళిత సంఘాలు, శ్రీనివాసరావు తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు సమావేశంలో పాల్గొన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి నేత ఫారూక్ షిబ్లీ, జనసేన నేత మహేశ్, దళిత బహుజన జేఏసీ నేత పోతుల బాలకోటయ్య తదితరులు ప్రసంగించారు. కోడికత్తితో చిన్నగా గీసిన శ్రీనివాసరావు ఐదున్నరేళ్లుగా జైల్లో ఉంటే, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోని నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని విమర్శించారు. 2019లో అధికారంలోకి రావడానికి జగన్ వేసిన పాచికలో జనుపల్లి బలైపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని జాతీయస్థాయిలో మానవ హక్కుల కమిషన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. వైసీపీ, బీజేపీ కలిసి శ్రీనివాసరావుకు బెయిల్ రాకుండా డ్రామాలాడుతున్నాయన్నారు. పదేపదే విదేశాలకు వెళ్లే జగన్‌కు కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పడానికి సమయం లేదా? అని ప్రశ్నించారు. వేల కోట్ల రూపాయలను దోచుకుని 12 కేసుల్లో ఉన్న జగన్ బెయిల్‌పై బయట ఉన్నారని, ఇది న్యాయవ్యవస్థకే సిగ్గుచేటని విమర్శించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులు ఎవరిని చిన్నపిల్లలను అడిగినా చెబుతారన్నారు. జనుపల్లి శ్రీనివాసరావుకు బెయిల్ వచ్చే వరకు పోరాటం చేయాలని, అన్ని రాజకీయ పక్షాలు ఢిల్లీలో పోరాటం చేయాలని సమావేశం నిర్ణయించింది. కాగా, శ్రీను బెయిల్ కేసులో అవసరమైతే ఇంప్లీడ్ అవుతామని వర్ల పేర్కొన్నారు. కాగా ఈ సమావేశంలో కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు.

మీడియాపై ఐ-'ప్యాక్'!

» జర్నలిస్టులకు వైసీపీ ఎన్నికల వల

» నాలుగైదు గ్యాడ్జెట్లతో కిట్ల పంపిణీ

» ఒక్కో కిట్ విలువ రూ.5వేల లోపే



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల వేళ అన్ని వర్గాలను మచ్చిక చేసుకునేందుకు వైసీపీ వ్యూహరచన చేస్తోంది. దీనిలో భాగంగా మీడియాపైనా ఎన్నికల వల విసురుతోంది. ఇళ్ల స్థలాల కేటాయింపు పేరిట ఇప్పటికే హడావుడి ప్రారంభించగా, ఇప్పుడు మండల స్థాయిలో పాత్రికేయులు, సోషల్ మీడియాలో న్యూస్ కంటెంట్ సృష్టికర్తలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు విలువైన ప్రత్యేక కిట్లు అందిస్తోంది. ఇదంతా ఐప్యాక్ బృందాల ఆధ్వర్యంలో సాగుతున్నట్లు తెలిసింది. జగన్ ఒంటెత్తు పోకడలు, ప్రజా వ్యతిరేక చర్యలతో వైసీపీకి వెన్నుదన్నుగా ఉంటోన్న వర్గాలు దూరమవుతున్నాయి. ప్రతిపక్షాలకు ప్రజాదరణ పెరుగుతోంది. దీన్ని అడ్డుకునేందుకు ఆయన సొంత, కూలి మీడియా ఎన్ని ప్రయత్నాలు చేసినా క్షేత్రస్థాయిలో ఆ నష్టాన్ని అడ్డుకోలేకపోతున్నాయి. దీంతో గ్రామ, మండల స్థాయిలోనే వ్యతిరేక వార్తలను అడ్డుకొని, సొంత భజన జరిగేలా, ప్రతిపక్షాలపై అడ్డగోలుగా బురద చల్లేలా వైసీపీ వ్యూహం పన్నుతోంది. ఇలాంటి ఎత్తుగడలు అమలు చేయడంలో ఆరితేరిన ఐప్యాక్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో మీడియా ప్రతినిధులకు కిట్ల పంపిణీ మొదలుపెట్టింది. పోర్ట్రానిక్స్ కంపెనీకి చెందిన సెల్ఫీ కెమెరా స్టిక్ స్టాండ్, బ్లూటూత్ నెక్‌బ్యాండ్, పవర్‌బ్యాంక్, స్మార్ట్‌వాచ్ ఇలా నాలుగైదు గ్యాడ్జెట్లతో కూడిన కిట్లను ఎంపిక చేసిన పాత్రికేయులు, సోషల్ మీడియాలో స్థానిక న్యూస్ కంటెంట్ క్రియేటర్లకు అందిస్తున్నారు. నిజానికి మండల, జిల్లా, రాష్ట్రస్థాయుల్లో తమ హక్కుల పరిరక్షణ కోసం పాత్రికేయులు పోరాటం చేస్తున్నారు. తమపై దాడులకు పాల్పడుతున్న అధికార పార్టీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని నినదిస్తున్నారు. వీటిపై స్పందించకుండా పోరాడుతున్న వారికి కిట్లు అందించడమేంటని జర్నలిస్టు సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగన్ సర్కారుకు, అధికార వైసీపీకి భజన చేసే కొంతమందికి తరచుగా విందులు, ఖరీదైన బహుమతులు ఇస్తున్నారని పాత్రికేయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగున్నరేళ్లలో ఎంతోమంది జర్నలిస్టులపై దాడులు జరిగాయి. అనేకమంది మరణించారు. ఈ దురాగతాలపై సీఎం జగన్, వైసీపీ ఎక్కడా స్పందించలేదు. మీడియాపై దాడులకు తెగబడిన సొంత పార్టీ నేతలను నియంత్రించలేదు. తీరా ఎన్నికల సమయం రాగానే పాత్రికేయులకు తాయిలాలు ఇవ్వడానికి సిద్ధపడటంపై జర్నలిస్టు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సర్కార్ సొమ్ముతో వైసీపీ భజన

» పథకాల ముసుగులో ఎన్నికల ప్రచారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ సొమ్ముతో వైసీపీ ఎన్నికల ప్రచారం చేపడుతోంది. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు ముసుగులో పార్టీ ప్రచారం చేసుకుంటోంది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 'సొంత' ప్రయోజనం కోసం, వచ్చే ఎన్నికల్లో గెలవడం కోసం ప్రభుత్వాన్ని అన్ని విధాలుగా వాడుకుంటోంది. తాజాగా డ్వాక్రా గ్రూపులతో ఆయా మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి 'జగనన్న డ్వాక్రా గ్రూపులకు అంత చేశాడు, ఇంత చేశాడు' అంటూ ప్రచారం చేసుకునేందుకు శ్రీకారం చుట్టారు. మంగళవారం జగన్ ఆసరా పథకం కింద డ్వాక్రా గ్రూపులకు నగదు బదిలీ చేస్తూ బటన్ నొక్కారు. దీంతో ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. అయినా ప్రతి మండలంలో డ్వాక్రా గ్రూపు సభ్యులందరినీ ఒకచోటకు చేర్చి ఎమ్మెల్యే/పోటీ చేయబోయే ఇన్‌చార్జ్‌తో చెక్కుల పంపిణీకి రంగం సిద్ధం చేశారు. అన్ని జిల్లాల డీఆర్‌డీఏ పీడీలకు ఈమేరకు ఆదేశాలు అందినట్లు సమాచారం. అందుకోసం ప్రతి మండలానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కూడా సమకూరుస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతిపైసా సర్కార్‌దే..

జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సొంత పార్టీ ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలున్నాయి. వైసీపీ కార్యకర్తలను వలంటీర్లుగా నియమించి ప్రభుత్వ ఖజానా నుంచి వేతనాలు చెల్లిస్తున్నారు. వారిని వైసీపీ ఎన్నికల సేవల కోసం వినియోగించుకుంటున్నారు. ఇక జగన్ 'బటన్' నొక్కుడు కార్యక్రమాల ప్రచారం కోసం ప్రకటనలకు కోట్లు ఖర్చు చేస్తున్నారు. పనిలో పనిగా జగన్ సొంత మీడియాకు భారీగా లబ్ధి చేకూరుస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి చేపట్టినవి, చేయనివి కూడా ప్రభుత్వ ఖర్చుతోనే అబద్ధాల ప్రచారం చేసుకుంటున్నారు. వైసీపీ రంగులద్దిన అందమైన ప్రచార పుస్తకాలు ముద్రించి వలంటీర్ల ద్వారా ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు. 1.50 కోట్ల బుక్‌లెట్ల ముద్రణకు సుమారు రూ.10 కోట్లు ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారు. గతంలో గ్రామ పంచాయతీ, సచివాలయాలు తదితర ప్రభుత్వ భవనాలన్నింటికీ వైసీపీ రంగులు వేయించి వందల కోట్లు దుర్వినియోగం చేశారు. ఇటీవల ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని జగన్ సర్కార్ ప్రారంభించింది. ఆటస్థలాలు లేకపోయినా, ఆటగాళ్లు కాని వారి పేర్లు నమోదు చేసుకుని ఆయా కార్యక్రమాలు నిర్వహించి ప్రచారం చేసుకుంటోంది. అందుకోసం ప్రతి మండలంలో రూ.లక్షలు నిధులు వెచ్చిస్తోంది. పేరుకు ప్రభుత్వ పథకం కాగా ప్రచారం జగన్, వైసీపీ గురించే చేస్తున్నారు. జగన్ బటన్ నొక్కుడు కార్యక్రమాలకు ప్రభుత్వ బస్సులతో పాటు ప్రైవేట్ స్కూళ్లను బెదిరించి స్కూల్ బస్సులలో జనాన్ని తరలిస్తున్నారు.

జగన్ సభలకు సీఐఎఫ్ నిధులు

వైఎస్ సర్కార్ ఇందిరమ్మ ఇళ్ల కోసం సీఐఎఫ్ నిధులు వాడి కరిగించగా, ఇప్పుడు జగన్ ప్రభుత్వంలో విచ్చలవిడిగా వాడేస్తున్నారు. నవరత్నాల అమల్లో భాగంగా జగన్ బటన్ నొక్కినప్పుడల్లా సభలకు డ్వాక్రా మహిళలను తరలించడం అలవాటైపోయింది. ఈ క్రమంలో బస్సులను ఆర్టీసీ అందించినప్పటికీ డ్వాక్రా సభ్యులకు ఆహారం, టిఫిన్, కూల్‌డ్రింక్స్, వాటర్‌బాటిల్ తదితర ఖర్చులన్నీ ఆయా మండల సమాఖ్యలే భరిస్తున్నాయి. ఇందుకోసం సీఐఎఫ్ నిధులు వాడేస్తున్నారు. ప్రతిసారి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు మాత్రమే ఇస్తుందని, ఖర్చు చేసిన తర్వాత బిల్లులు తీసుకోవడం కష్టంగా ఉందంటున్నారు. దాని ప్రభావం సీఐఎఫ్ నిధులపై పడుతోందని వాపోతున్నారు.

నిధులిస్తామని పిలిచి ఎండలో నిలబెట్టారు

కావలి, జనవరి 24: ఆసరా నిధులు ఇచ్చేందుకు సంతకాలు పెట్టాలని పిలిపించిన పొదుపు మహిళలకు అధికారులు చుక్కలు చూపించారు. నెల్లూరు జిల్లా కావలి, రూరల్ మండలంలోని పొదుపు గ్రూపులకు నాలుగో విడత ఆసరా నిధులు ఇవ్వడానికి సభ పెట్టారు. ఈ సభలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు సుదీర్ఘ ఉపన్యాసాలు ఇచ్చారు. చోటామోటా నేతలు కూడా మైకుల్లో రెచ్చిపోయారు. మీటింగ్ అయ్యాక మహిళలు భోజనాలకు తోసుకెళ్లడంతో గేట్లు మూయించారు. మహిళలు రోడ్డుపైనే గంటల తరబడి నిలబడిపోయారు. చివరిగా వెళ్లిన వారికి భోజనాలు అందలేదు.

జనసేన ప్రచార వాహనంపై దాడి

» అద్దాలు ధ్వంసం.. తాళాలు, వాహన పత్రాలు లాక్కెళ్లిన వైసీపీ నేతలు

» కాకినాడ జిల్లా పెదపూడిలో దౌర్జన్య కాండ

» రోడ్డుపై టీడీపీ, జనసేన శ్రేణుల ఆందోళన

కాకినాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ వైసీపీ గూండాగిరీకి దిగింది. జగన్ ప్రభుత్వ వైఫల్యాలపై గ్రామగ్రామాన ప్రచారం చేస్తున్న జనసేన ప్రచార వాహనంపై వైసీపీ నేతలు దాడికి తెగబడ్డారు. వాహన అద్దాలు ధ్వంసం చేసి తాళాలు, జీపుప్రచార అనుమతి పత్రాలను లాక్కుపోయారు. బుధవారం సాయంత్రం కాకినాడ జిల్లా అనపర్తి నియోజకవర్గం పెదపూడిలో ఈ దారుణం జరిగింది. దీనిపై జనసేన, టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుపై నిరసన చేపట్టాయి. సామర్లకోట మండలానికి చెందిన జనసేన నేతలు ప్రచార అనుమతులు తీసుకుని వాహనంలో గ్రామగ్రామాన తిరుగుతూ జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నారు. పెదపూడి మండలం శహనాపురంలో ఈ వాహనాన్ని వైసీపీ స్థానిక నేత బుద్ధా వెంకన్న, ఎంపీటీసీ భర్త చందళ్ల వెంకటరమణ, మరికొంత మంది అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. తమకు అనుమతులు ఉన్నాయని, కావాలంటే మీరు కూడా ప్రచారం చేసుకోండని జనసేన నేతలు అనడంతో వైసీపీ నేతలు ప్రచార వాహనంపై దాడి చేసి అద్దాలు పగులగొట్టారు. వాహనం తాళాలు తీసుకుని వెళ్లిపోయారు. దీంతో టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జనసేన నేతలు ఆందోళనకు దిగారు. దాడి కి పాల్పడిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేసినా పోలీసులు పట్టించుకోలేదు. ఇరువర్గాల మధ్య గొడవ పెరిగి ఉద్రిక్తతకు దారితీయడంతో పరిస్థితి అదుపు తప్పుతుందని గ్రహించిన పోలీసులు ఆఖర్లో వచ్చి వాహనాన్ని స్టేషన్‌కు తరలించి ఇరువర్గాలను చెదరగొట్టారు.

కంటైనర్ టెర్మినల్ మూసేస్తే 10 వేల మంది రోడ్డుపాలు

» పోరాటం చేసైనా అడ్డుకుంటాం: ఉద్యోగులు, కార్మికులు

ముత్తుకూరు, జనవరి 24: అదానీ కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ మూసివేస్తే సుమారు పది వేలమంది బతుకులు రోడ్డుపాలవుతాయని ఆధారిత కంపెనీల ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కంటైనర్ టెర్మినల్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న కంపెనీల ఉద్యోగులు, కార్మికులు ఏకమై కంటైనర్ టెర్మినల్ తరలిపోకుండా నిలుపుకొనేందుకు పోర్టులోని గోపాలపురంలో బుధవారం కార్యాచరణ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మీడియాతో మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగానే కంటైనర్ టెర్మినల్‌ను అదానీ కృష్ణపట్నం పోర్టు నుంచి చెన్నైకి తరలిస్తున్నారని, దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమంది జీవనోపాధి కోల్పోతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను కాపాడాలని కంటైనర్ టెర్మినల్ ఉద్యోగులు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కంటైనర్ టెర్మినల్‌ను కృష్ణపట్నం పోర్టు నుంచి అదానీ కంపెనీ చెన్నైకి తరలిస్తోందని, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది జీవనోపాధి కోల్పోతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఈసీ దృష్టికి

» హైకోర్టు స్పష్టీకరణ.. పిల్ పరిష్కారం

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే దాని దృష్టికి తీసుకెళ్లవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. కృష్ణా జిల్లా మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలో కొత్త ఓటర్ల నమోదు విషయంలో పారదర్శకత పాటించేలా ఎన్నికల అధికారులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఈ పిల్‌ను మచిలీపట్నానికే చెందిన ఇమడాబత్తుల దిలీప్‌కుమార్ దాఖలు చేశారు. ఎలక్షన్ రిజిస్ట్రేషన్ రోల్స్. సెక్షన్ 6ని అనుసరించి ఓటర్ల జాబితా సిద్ధం చేసేలా ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. ఈసీ విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే కమిషన్ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం సాగుతుందని తెలిపారు. ప్రస్తుత పిటిషన్‌పై విచారణను కొనసాగించాల్సిన అవసరం లేదన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎంవీ రమణకుమారి వాదనలు వినిపిస్తూ.. చట్ట నిబంధనలను అనుసరించి ఓటర్ల జాబితాను సిద్ధం చేయడంలో ఎన్నికల అధికారులు విఫలమయ్యారని తెలిపారు. సెక్షన్ 6 ప్రకారం అక్షర క్రమం లేదా ఇంటి నంబర్ ఆధారంగా వరుస క్రమంలో ఓటర్ల జాబితా సిద్ధం చేయాలన్నారు. అందుకు విరుద్ధంగా ప్రస్తుత జాబితా ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

రాష్ట్రం మార్పుకోరుతోంది!

» జగన్ ప్రజావిశ్వాసాన్ని కోల్పోయారు

» ఈసారి కాంగ్రెస్‌కే అవకాశమిస్తారు

» 'ఆంధ్రజ్యోతి'తో రాష్ట్ర ఇన్‌చార్జి ఠాగూర్



అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా .. పాలనాపరంగా రాష్ట్రం మార్పు కోరుతోందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ అన్నారు. సీఎం జగన్ ప్రజావిశ్వాసాన్ని కోల్పోయారని, జనం ఈసారి కాంగ్రెస్‌కే పట్టం కడతారని ఆశాభావం వ్యక్తంచేశారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ప్రక్రియను బుధవారం విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు సుంకర పద్మశ్రీ, మస్తాన్‌వలీతో కలసి ఠాగూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. తన స్వరాష్ట్రం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రజలు భావోద్వేగంలో ఒకేలా ప్రవర్తిస్తారని, ప్రతి ఐదేళ్లకోసారి ప్రభుత్వాలను మార్చేసే అలవాటు రెండు రాష్ట్రాల ప్రజలకు ఉందన్నారు. ఏపీలో ఐదేళ్లు చంద్రబాబుకు, మరో ఐదేళ్లు జగన్‌కు అవకాశం ఇచ్చారని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని తెలిపారు. తమకు 90 అసెంబ్లీ స్థానాలు దక్కుతాయని చెప్పారు. ఇటీవల ఓ ప్రముఖ సంస్థ నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో రాహుల్‌కు 49 శాతం మంది.. మోదీకి 46 శాతం మంది ఓటేశారని తెలిపారు. ఏపీలో కాంగ్రెస్‌కు చెక్కుచెదరని కేడర్ ఉందని.. కానీ పదేళ్లుగా నాయకత్వమే లేకుండా పోయిందన్నారు. వైఎస్ షర్మిల రాకతో.. కాంగ్రెస్ బలోపేతమవుతుందని, పార్టీలో నూతనోత్తేజం కనిపిస్తోందని చెప్పారు. విభజన హామీలను కేంద్రం చేత అమలు చేయించడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారన్నారు.

అభ్యర్థులకు దరఖాస్తులు..

కాంగ్రెస్ అభ్యర్థిత్వాల దరఖాస్తులకు రుసుములు నిర్ధారించారు. లోక్‌సభ జనరల్ స్థానానికి రూ.25,000, రిజర్వుడు స్థానానికి రూ.15,000, అసెంబ్లీ జనరల్ సీటుకు రూ.10,000, రిజర్వుడు నియోజకవర్గానికి రూ.5,000 యాప్ ద్వారా చెల్లించాలని ఠాగూర్ చెప్పారు. గుంటూరు ఈస్ట్‌కు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ, మడకశిరకు మాజీ ఎమ్మెల్యే సుధాకర్, బద్వేల్‌కు కమలమ్మ దరఖాస్తులు స్వీకరించారు. మరో పది మంది కూడా దరఖాస్తులు తీసుకున్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల తీసుకోలేదు. ఎప్పుడు తీసుకుంటారని అడుగగా.. సమయం రావాలని ఆళ్ల బదులిచ్చారు.